# మానవ హక్కుల వేదిక

## రెండవ రాష్ట్ర మహాసభలు

26, 27 మే 2007, శ్రీకాకుళం.

### ప్రధాన కార్యదర్శి నివేదిక

మిత్రులారా..!

రెండవ రాష్ట్ర మహాసభలకు హాజరైన మానవ హక్కుల వేదిక సభ్యులందరికీ వందనాలు.

మానవ హక్కుల వేదిక 1998 నవంబర్ నెలలో కేవలం 34 మంది సభ్యులతో ఏర్పడింది. వ్యవస్థాపక సభ్యులందరూ అంతకుముందు ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘంలో పనిచేసిన వారే. హక్కుల ఉద్యమం పాత్ర గురించి, అవగాహన గురించి, మౌలికమైన విభేదాలు ఉన్న నేపథ్యంలో ఆ సంస్థలో కొనసాగడం సాధ్యం కాదనుకుని మనకంటూ ఏర్పరుచుకున్న అవగాహనను ఆచరణలో పెట్టడం కోసం వేరే సంస్థను ఆనాడు ఏర్పాటు చేసుకోవడం జరిగింది. వ్యవస్థితమైన అసమానత ఎక్కడ ఉన్నా అక్కడ హక్కుల లేమి లేక నిరాకరణ ఉంటుందని గుర్తించి, ఏ ఒక్క సామాజిక లేక రాజకీయ సందర్భానికి ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వకుండా, అవగాహనలోనూ ఆచరణలోనూ విశాల ప్రాతిపదికన స్వతంత్రంగా పనిచేయడం(క్లుప్తంగా) మన లక్ష్యంగా పెట్టుకున్నాం.

అయితే మానవ హక్కుల వేదిక ఏర్పడిన నేపథ్యం కారణంగా కొన్ని అపోహలు నెలకొన్నాయని గుర్తించి మొదట్లో సభ్యత్వాన్ని పెంచే ప్రయత్నం చేయకుండా మన అవగాహనను .ఆచరణలో స్పష్టపరచడం లక్ష్యంగా పెట్టుకుని పనిచేశాము. వివిధ విషయాలమీద మన అవగాహనను వివరిస్తూ సభలు నిర్వహించాం, కరపత్రాలు వేశాం, ఇతర ప్రచురణలు తీసుకువచ్చాం.

మనం ప్రతిపాదించిన అవగాహన వివరాల్లోకి పోతే, ప్రజా ఉద్యమాలపైన ముఖ్యంగా మిలిటెంట్ స్వభావం గల రాజకీయ ఉద్యమాల పైన, ప్రభుత్వం ప్రయోగించే దమనకాండ హక్కుల ఉద్యమం ఎజెండాలో ఒక ముఖ్య విషయంగానే ఉంటుంది గానీ హక్కుల ఉద్యమం ఆచరణ దాని చుట్టూ అల్లుకుని ఉండవలసిన అవసరం లేదు. అణిచివేత అనేది ప్రభుత్వం లేక రాజ్యం ఉద్యమాల పైన ప్రయోగించే దమనకాండ రూపంలోనే కాక అనేక రూపాల్లో ఉంటుంది. అన్ని రకాల అణచివేతకు హక్కుల ఉద్యమ అవగాహనలో సముచిత స్థానం ఇవ్వడం అవసరం. రాజ్యం అనేది కూడా కేవలం అణచివేత కేంద్రం కాదు. చారిత్రకంగా సంక్రమించిన ప్రజాతంత్ర పాలనా నియమాలు, సామాజిక సంక్షేమ బాధ్యతలు, ప్రాథమిక హక్కులు కల్పించే చట్టాలు కూడా రాజ్యం నిర్మాణంలో భాగమే. అణిచివేత అంశాన్ని వ్యతిరేకించడం ఎంత ముఖ్యమో, ఈ రెండవ పార్శ్వాన్ని పెంపొందించడం, నిలబెట్టడం, హక్కుల ఉద్యమ ఎజెండాలో అంతే ముఖ్యమైన విషయాలు. ప్రజాస్వామ్యాన్ని కేవలం పాలనా నియమాలలోనూ, రాజకీయ వ్యవస్థలోనే కాక సామాజిక ఆర్థిక జీవితంలోనూ చూడాలని గుర్తించి, సామాజిక సంబంధాలు, సంస్కృతీ సంప్రదాయాల ప్రజాస్వామీకరణ, మానవీకరణ కూడా హక్కుల ఉద్యమ ఎజెండాలో భాగం చేసుకోవాలి. జీవితాల మెరుగుదలకు, హక్కుల సాధనకు సంఘటిత ఉద్యమాలు అవసరం కాగా, సంఘటిత పడి ఉద్యమించే స్థితిలో లేని సామాజిక వర్గాల బాగోగులకు వివిధ స్థాయిలలో జరిగే సంస్కరణాత్మక కృషి కూడా అవసరం. దానిని బలోపేతం చేయడం, పెంపొందించడం అవసరం. సంఘటిత ప్రజా పోరాటాలు, రాజకీయ ఉద్యమాల ఆవశ్యకత ఒక ముఖ్యమైన వాస్తవం అయినప్పటికీ ఆ ఉద్యమాలు మానవ విలువల కోణం నుండి విమర్శకు అతీతం కాదు. వాటి ఆచరణ ప్రజల- ముఖ్యంగా అట్టడుగు వర్గాల ప్రజల - హక్కులకు, క్షేమానికి, ఉనికికి నష్టకరంగా పరిణమించినప్పుడు విమర్శించాలి. ప్రజల పట్ల మన బాధ్యతగా అటువంటి విమర్శ సందర్భం వచ్చినప్పుడు మనం చేపట్టాలి. హక్కులను, వాటి నేపథ్యమైన సామాజిక ఆర్థిక రాజకీయ జీవితాన్ని అర్థం చేసుకునేటప్పుడు వివిధ తాత్విక, సిద్ధాంత దృక్పథాలు ఉనికిలో ఉన్నాయని, దేని ప్రత్యేకత దానికి ఉందని గుర్తించి, వీటిలో ఏ ఒక్క సిద్ధాంతాన్ని మానవ హక్కుల ఉద్యమం ప్రామాణికమైనదిగా స్వీకరించకుండా ప్రతీ ఒక్క దృక్పథంలోనూ ఉన్న ప్రజాస్వామిక, మానవీయ అంశాన్ని స్వీకరించి అన్నిటినీ క్రోడీకరించి తనకంటూ ఒక విశాల ప్రాపంచిక దృక్పథాన్ని ఏర్పరుచుకోవడం అవసరం. వ్యవస్థితమైన అసమానత ఎక్కడ ఉన్నా అక్కడ హక్కుల లేమి ఉంటుంది. దానికి వ్యతిరేకంగా వివిధ రూపాల కృషిని చేపట్టడం, పెంపొందించడం, మద్దతు ఇవ్వడం, ఆ కృషి ఫలితాలను సామాజిక వ్యవస్థలో, ఆలోచనా రీతులలో, సంస్కృతిలో, పాలనా నియమాలలో వ్యవస్థితం చేసే దిశగా పనిచేయడం మానవ హక్కుల ఉద్యమం కార్యరంగం.

ఈ అవగాహన మనకు మానవ హక్కుల వేదిక ఏర్పాటు చేసుకున్న తర్వాత కలిగినది కాదు. ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘంలో పనిచేస్తున్న క్రమంలోనే ఏర్పడింది. దానికి అనుగుణంగా అప్పుడే పనిచేయడం మొదలు పెట్టాం. దానిని చర్చకు కూడా పెట్టాం. మానవ హక్కుల వేదిక ఏర్పాటు చేసుకున్న తర్వాత ఈ అవగాహన ప్రకారం మరింత స్పష్టంగా పనిచేయగలిగాము. దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత మానవ హక్కుల వేదికకు తనదంటూ ఒక గుర్తింపు ఏర్పడిందని, తొలినాటి అపోహలు

(P.T.O.)

తొలగిపోయాయని భావించి నిర్మాణాన్ని పెంచుకునే దిశగా దృష్టి పెట్టాం. కొత్త సభ్యులను చేర్చుకున్నాం. జిల్లాలో అడహక్ కమిటీలు, కొన్ని జిల్లాల్లో పూర్తి స్థాయి కమిటీలు వేసుకున్నాం. 2005 మే 7, 8తేదీలలో మిర్యాలగూడంలో ప్రథమ మహాసభలు జరుపుకుని సంస్థ లక్ష్య ప్రకటనను, నియమావళిని రూపొందించుకున్నాము. ఇప్పుడు కొత్తగా చేరుతున్న సభ్యులు మన ఆచరణను, అవగాహనను చూసి ప్రభావితులై చేరుతున్నారు.

మన అవగాహన లక్ష్య ప్రకటనలో నిర్దేశించుకున్న కర్తవ్యాన్ని అమలు చేస్తూ ప్రజల హక్కులను కాపాడటానికి, పెంపొందించడానికి గడిచిన రెండు సంవత్సరాలలో ఏ మేరకు కృషి చేశామో, ఆ కృషికి అనుగుణంగా సంస్థ నిర్మాణాన్ని ఏ మేరకు మెరుగు పర్చుకోగలిగామో ఇప్పుడు చర్చించుకుందాం. మనం చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించుకుని ఆ తర్వాత నిర్మాణాన్ని గురించి మాట్లాడుకుందాం.

## 1. విస్థాపన, నిర్వాసితుల సమస్యలు:

ఈ రెండేళ్లలో మనం అధికంగా పనిచేసింది నీటి పారుదల ప్రాజెక్టులు, పరిశ్రమలు, ప్రత్యేక ఆర్థిక మండళ్లు, ఔటర్ రింగ్ రోడ్డు వంటి రహదారి ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులు కాబోయే వారి హక్కుల గురించి.

పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మనం మొదటి మహాసభల కంటే ముందు నుండే పనిచేస్తున్నాం. ఆ ప్రాజెక్టును వ్యతిరేకించడానికి ఇతర కారణాలు కూడా ఉన్నప్పటికీ ఆదివాసీ ప్రజల విస్థాపన (Displacement) మానవ హక్కుల కోణం నుండి ప్రధాన కారణం. పోలవరం ప్రాజెక్టును వ్యతిరేకించే ఆందోళనలో ఇప్పుడు చాలా సంస్థలున్నాయి. ఆదివాసీ సంఘాలు, తెలంగాణ ఉద్యమ సంస్థలు, ఎన్.జి.ఒ.లు పనిచేస్తున్నాయి. అయితే మొట్టమొదట వివరమైన నివేదికను ప్రచురించింది మనమే. ఆ నివేదికను ఏడవ బులిటెన్‌లో ప్రచురించాం. మొదటి రాష్ట్ర మహాసభల తర్వాత 'పోలవరం ప్రాజెక్టును ఎందుకు వ్యతిరేకిస్తున్నాం?' అనే శీర్షికతో కరపత్రం అచ్చువేసి, విస్తృతంగా పంచాం. గోదావరి నీళ్ల తప్ప గత్యంతరం లేని ఉత్తర తెలంగాణ జిల్లాల నీటి హక్కును దెబ్బతీస్తుందని, వెనుకబడిన ప్రాంతాలను ముంచి అభివృద్ధి చెందిన ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడం ద్వారా ప్రాంతీయ అసమానతలను పెంచుతుందని, దాదాపు లక్షన్నర జనాభాను, ప్రధానంగా ఆదివాసీలను తమ భూభాగం నుండి నిర్వాసితులను చేసి వారి జీవనాన్నే కాదు, జీవన విధానాన్ని పూర్తిగా ధ్వంసం చేస్తుందని పోలవరం ప్రాజెక్టును మనం వ్యతిరేకిస్తున్నాం. ఆ లక్షన్నర ప్రజానీకానికి ఒకవేళ ఏజెన్సీ అంచునగానీ, మైదాన ప్రాంతంలోగానీ పునరావాస కాలనీలు కట్టించి తలా ఎకరం బంజరు భూమికి డిఫారం పట్టా ఇచ్చి కొంచెం నగదు నష్టపరిహారం చేతిలో పెడతారనుకున్నా (ప్రస్తుత పరిస్థితుల్లో ఈ మాత్రం పునరావాసమే మహాభాగ్యం) అడవి ఇచ్చే అనేక రకాల ఆసరాలను వారు శాశ్వతంగా కోల్పోవడమేగాదు, అడవినే ఆవాసంగా గల ఆదివాసీ జీవిత సంస్కృతి సమాధి అయిపోతుంది. ఈ విధ్వంసాన్ని వ్యతిరేకించడం కేవలం 'సెంటిమెంట్' కాదు. ఆ జీవిత సంస్కృతి గిరిజనేతర సమాజాన్ని ఎదుర్కొనడానికి ఆదివాసీలకు బలాన్ని ఇచ్చింది, ఆత్మగౌరవాన్ని ఇచ్చింది. పునరావాస కాలనీలలో బందీలైన ఆదివాసీలు తమ స్వతంత్ర వ్యక్తిత్వాన్ని కోల్పోతారు. గిరిజనేతర సమాజాన్ని ఎదుర్కొనే మానసిక శక్తిని కోల్పోతారు.

పోలవరం వ్యతిరేక ఆందోళనలో మనం ఇప్పటికీ పాల్గొంటూనే ఉన్నాం. అయితే ఆందోళన బలహీనంగా ఉంది. వివిధ ఉద్యమ సంస్థలు ఒకరితో నిమిత్తం లేకుండా ఒకరు కార్యక్రమాలు చేపడుతుండడం వల్ల సంఘటిత శక్తి వ్యక్తం కావడం లేదు.ఉమ్మడి కార్యక్రమాల ఆవశ్యకత గురించి మనం ఇవ్వగల సలహా ఇస్తున్నాం గాని వినేవారు లేరు. అయితే దాదాపు అన్ని సంస్థల వారు మన భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తున్నారు కాబట్టి ఇంకా ఈ ప్రయత్నం కొనసాగించే అవకాశం ఉంది.

వంశధార స్టేజ్-2 ప్రాజెక్టు వల్ల నిలువనీడ కోల్పోయే ఆదివాసీల విషయం వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ మన దృష్టికి తీసుకువచ్చింది. శ్రీకాకుళం జిల్లా హిరమండలం సమీపంలో నిర్మించబోయే రిజర్వాయర్‌కు ఆవల ఉన్న కొండలమీద దాదాపు 80 ఆదివాసీ ఆవాసాలున్నాయి. ఈ ప్రజలిప్పుడు తమ శ్రమను అమ్ముకోడానికి, అవసరమైన సరుకులు కొనుక్కోవడానికి హిరమండలం వచ్చిపోతున్నారు. కాని రిజర్వాయర్ పూర్తయితే వారికి బయటి ప్రపంచంతో సంబంధం తెగిపోతుంది. వెనుక కొండ ముందు జలాశయం ఉంటాయి. వారి బతుకు దుర్భరమవుతుంది. ఈ విషయమై మనం ప్రచారం చేయడమే గాక, సీతంపేట ప్రాజెక్టు ఆఫీసర్‌కు, జిల్లా కలెక్టర్‌కు, నీటిపారుదల ప్రధాన కార్యదర్శికి వివరమైన ఫిర్యాదులిచ్చాము. బాధితులను కూడా కదిలించి ఆందోళనలు చేపట్టాం, హైకోర్టులో కేసు కూడా వేశాము. ఇప్పటికీ ఈ ఆందోళన ఓ కొలిక్కి రాలేదు.

కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో సింగరేణి బొగ్గు గనుల యాజమాన్యం ఓపెన్‌కాస్ట్ గనుల కోసం భూములు సేకరించేటప్పుడు అనుసరిస్తున్న విధానం వందలాది కుటుంబాలను నిర్వాసితులు అన్న పేరు పెట్టకుండా నిర్వాసితులను చేస్తున్నది. ఓపెన్‌కాస్ట్ గనికి ఎంతమేర భూమి కావాలో అంత మేరకు మాత్రమే సింగరేణి యాజమాన్యం భూమి సేకరణ జరుపుతోంది. చుట్టు పక్కల ఉండే ఆవాసాలతో వారికి నిమిత్తం లేదు. కాని గనులలో బ్లాస్టింగ్ వల్ల ఆ ఊర్లలో ఇళ్లు బీటలు వారతాయి, కూలిపోతాయి. ఓవర్ బర్డెన్ ధూళి వల్ల వాతావరణం కలుషితమవుతుంది. ఆ ఊళ్లలోని బావులు, బోర్ల కంటే గని లోతుగా తవ్వినప్పుడు ఆ నీటి వనరులు ఇంకిపోయే ప్రమాదముంది. అందువల్ల తమ జీవనం దెబ్బతింటున్నదంటూ ఆ గ్రామాల ప్రజలు చేస్తున్న ఆందోళనకు మనం మద్దతునిచ్చాము. ఆ గ్రామాల్లో పర్యటించి విషయ సేకరణ చేశాము. కాలుష్య నియంత్రణ మండలికి నివేదిక సమర్పించాము. అయితే సింగరేణి బొగ్గు గనుల కంపెనీది అన్ని రకాలుగా మొద్దుబారిన యాజమాన్యం కావడం వల్ల ఈ ప్రయత్నాలకు పెద్దగా స్పందన లేదు.

ప్రత్యేక ఆర్థిక మండలులది (ఎస్.ఇ.జెడ్.లు) ప్రత్యేకమైన కథ. మన రాష్ట్రంలో విశాఖపట్నం, తూర్పు గోదావరి, చిత్తూరు జిల్లాలో మూడు పెద్ద ఎస్.ఇ.జెడ్.లు, హైదరాబాద్ పరిసరాల్లో అనేకం చిన్నవి రూపొందుతున్నాయి. విదేశీ మార్కెట్‌కు ఎగుమతులు

వేగంగా పెంచడం ఈ ఎస్.ఇ.జెడ్.ల లక్ష్యం. అన్ని హంగులూ ఉన్న చక్కటి టౌన్‌షిప్‌లకు లే అవుట్‌లు వేసి, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విధించే అన్ని రకాల పన్నుల నుండి రాయితీలిచ్చి, కార్మిక చట్టాల నుండి కూడా మినహాయింపునిచ్చి, ఎగుమతి రంగంలో పెట్టుబడులు పెట్టగల కంపెనీలను దేబిరించి దేశంలోకి రప్పించుకోవడం కోసం ఈ ఆలోచన చేశారు. ఒక విశాల భూభాగాన్ని ప్రభుత్వం సేకరించి ఒక 'డెవలపర్' అని పిలువబడే మధ్యవర్తికి అమ్ముతుంది. ఆ మధ్యవర్తి ప్రభుత్వం అజమాయిషీలో ఆ భూభాగాన్ని అభివృద్ధి చేస్తాడు. నాల్గోవంతు భూభాగాన్ని అక్కడ పెట్టుబడి పెట్టబోయే కంపెనీలకు కేటాయించి, మిగిలిన భూభాగంలో ఇళ్లకాలనీలకు, షాపులకు, వినోద స్థలాలకు, హోటళ్లకు లే అవుట్ వేస్తాడు. కంపెనీలను ఆహ్వానించి భూమిని అమ్ముకుంటాడు. ఆ కంపెనీలు విశేషమైన రాయితీలు, మినహాయింపులు పొంది లాభార్జన దండిగా చేసుకుంటాయి. దీని కోసం గ్రామాలకు గ్రామాలను ఖాళీ చేయిస్తున్నారు.

ఇది అన్ని రకాలుగా అభ్యంతరకరమైన ప్రయోగం. దీనిని ఒక ఫ్యాక్టరీ కోసం జరిగే భూ సేకరణతో పోల్చడానికి వీలులేదు. సారవంతమైన భూములను ఎస్.ఇ.జెడ్.లకు ఇవ్వబోమని, అసలు వ్యవసాయ యోగ్యమైన భూములనే ఇయ్యబోమని, కాంగ్రెస్ నాయకులు అప్పుడప్పుడు చేస్తున్న ప్రకటనలు అమలు కాకపోగా, వాటికి అర్థం కూడా లేదు. ఎస్.ఇ.జెడ్.కు ఎగుమతి వ్యాపారానికి అనుకూలమైన చోట విశాలమైన, అవిచ్ఛిన్నమైన భూభాగం కావాలి. ఏరి ఏరి ఇక్కడొక ఎకరం, అక్కడొక ఎకరం బంజరుభూమిని తీసి ప్రత్యేక ఆర్థిక మండలిని నెలకొల్పడం సాధ్యం కాదు.

అందువల్ల ప్రత్యేక ఆర్థిక మండలులు అనే భావననే తిరస్కరించాలనీ ఎస్.ఇ.జెడ్. చట్టాన్నే రద్దు చేయాలనీ మనం డిమాండ్ చేస్తున్నాం. మన రాష్ట్రంలో మూడు ప్రధాన ఎస్.ఇ.జెడ్‌లు అయిన చిత్తూరు, విశాఖపట్నం, తూర్పు గోదావరి ప్రత్యేక ఆర్థిక మండలుల గురించి మనం వివరంగా సమాచార సేకరణ చేయడమే కాక వాటికి వ్యతిరేకంగా స్థానిక రైతులు చేస్తున్న ఆందోళనలో చురుగ్గా పాల్గొంటున్నాం.

విస్థాపన వల్ల ఆదివాసీల తర్వాత అత్యధికంగా నష్టపోయేది మత్స్యకారులు. ఆదివాసీలకు సంప్రదాయకంగా అడవి మీద హక్కు ఉన్నట్టే మత్స్యకారులకు సముద్రం మీద, సముద్రతీరం మీద ఉంది. అయితే ఈ హక్కులను చట్టం గుర్తించదు. అందువల్ల ప్రత్యేక ఆర్థిక మండలుల కోసమైనా, కృష్ణపట్టణం, గంగవరంలోలాగా ఓడరేవు కోసమైనా, లేదా నక్కపల్లిలోలాగా మందుల ఫ్యాక్టరీ కోసమైనా తీర ప్రాంత భూములు సేకరించినప్పుడు మత్స్యకారులు తమ జీవనాన్ని సంపూర్ణంగా కోల్పోయే ప్రమాదముంటుంది. ఆదివాసీల విషయం చాలా వరకూ అందరికీ అవగాహనకు వచ్చింది గానీ మత్స్యకారుల విషయం రాలేదు. ముందు అది విస్తృతంగా అవగాహనకు వస్తే ఆ తర్వాత చట్టపరమైన పరిష్కారం కోసం ఆలోచించవచ్చు. మనం అవగాహన కలిగించే ప్రయత్నం చేపట్టాము - ఆ పని ఇంకా విస్తృతంగా చేయవలసి ఉంది.

హైదరాబాద్ పరిసరాల్లో భూమి ఖరీదు విపరీతంగా పెరగడం వల్ల ఏదో ఒక పేరు చెప్పి భూములు చేజిక్కించుకోడానికి దళారులు, వ్యాపారస్తులు, పారిశ్రామిక కంపెనీలు రకరకాల అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రభుత్వ భూముల లీజును చవకగా పొందడం, ఎస్.ఇ.జెడ్.ల డెవలపర్‌లుగా అవతారమెత్తడం, ప్రైవేటు భూములు నయానో భయానో చేజిక్కించుకోవడం నిత్యం జరుగుతున్నది. ఆ భూములను అప్పటిదాకా పట్టా ఉండో లేకో అనుభవిస్తున్న వారు ఒకొక్కసారి వట్టి చేతులతో, ఒకొక్కసారి నామమాత్రపు నష్ట పరిహారం లేక కొనుగోలు పైకంతో వీధిన పడుతున్నారు. దీనిని కాంగ్రెస్, తెలుగుదేశంల వైరంగా చిత్రీకరిస్తున్న మీడియా ప్రచారాన్ని అధిగమించి ఇది పేదల భూమి సమస్య అని అవగాహన కలిగించడం అవసరం. ఆ పని మనం కొంత మేరకు చేయగలిగాం.

నిర్వాసితుల హక్కుల అతిక్రమణ కారణంగా మనం వివిధ ప్రాజెక్టులను వ్యతిరేకించేటప్పుడు, లేదా నిర్వాసితుల హక్కుల కోసం ఆందోళన చేసేటప్పుడు ప్రాజెక్టులు, ఫ్యాక్టరీలు కట్టడానికి, నెలకొల్పడానికి అసలే వీలులేదంటున్నామా, గనులు తవ్వడానికి అసలే వీలు లేదంటున్నామా అనే ప్రశ్నలు వస్తాయి.

నిజానికి మనం ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి పేరిట అమలువుతున్న ప్రణాళికలలో పూర్తిగా వ్యతిరేకిస్తున్నది ఎస్.ఇ.జెడ్.లను, ఆదివాసీ ప్రజలను పెద్ద ఎత్తున నిర్వాసితులను చేసే పోలవరం ప్రాజెక్టును, ప్రాణాంతక కాలుష్యం కలిగించే యురేనియం తవ్వకాన్ని, ఆదివాసీ జీవితాన్నే కాక పర్యావరణాన్ని కూడా ధ్వంసం చేసే బాక్సైట్ తవ్వకాన్ని, నల్గొండ ఫీల్డ్‌ఫైరింగ్ రేంజ్‌ను, నీటి హక్కుల అసమాన పంపిణీకి ప్రతీక అయిన పులిచింత ప్రాజెక్టును. తక్కిన ప్రాజెక్టుల విషయంలో వాటి అవసరాన్ని లేక అవి తీసుకుంటున్న రూపాన్ని, వాటికి సంబంధించిన ఇతర లక్షణాలను ప్రశ్నిస్తున్నామే తప్ప సూత్రప్రాయంగా అన్ని ప్రాజెక్టులను, ప్రణాళికలను తిరస్కరించడం లేదు.

కాగా, నిర్వాసితుల విషయానికి వచ్చే సరికి మానవీయ ప్రమాణాలున్న పునరావాస విధానం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం. మనదేశంలో భూ సేకరణ చట్టం కింద స్థిరాస్తులకు ఇచ్చే నష్టపరిహారం తప్ప వేరే పునరావాసమేమీ ఒక హక్కు కాదు. కేంద్ర ప్రభుత్వం ఒకటికి రెండుసార్లు సహాయ పునరావాస విధానం ముసాయిదాలు అంటూ ప్రకటించింది గాని అవి తుది రూపం తీసుకోలేదు. ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రకటించిన పునరావాస విధానాలననుసరించి స్థిరాస్తులు లేని వారికి కూడా కొంత నగదు రూపంలో నష్టపరిహారం, ప్రత్యామ్నాయ ఇళ్ల స్థలాల మంజూరు వగైరా లభిస్తే లభించవచ్చు. కాని అంతర్జాతీయ స్థాయిలో విస్థాపన గురించి జరుగుతున్న చర్చ అత్యంత మానవీయమైన ప్రమాణాలను ప్రతిపాదించింది. బలవంతంగా ఎవరినీ నిర్వాసితులను చేయడానికి వీలు లేదనేది ఒక సూత్రం - అంటే నిర్వాసితులు కాబోయేవారు స్వచ్ఛందంగా సమ్మతించినట్లైతేనే ప్రాజెక్టులు చేపట్టవచ్చునని అర్థం. ఒకవేళ బలవంతపు భూ సేకరణ తప్పనిసరి అయితే, ఏ ప్రాజెక్టు లేక ప్రణాళిక కోసమైతే ఆ ప్రజలు నిర్వాసితులవుతున్నారో, ఆ ప్రాజెక్టు లేక ప్రణాళిక వల్ల వచ్చే మొదటి ప్రయోజనం వారికే దక్కాలనేది రెండవ సూత్రం. ఒక ప్రజా సమూహాన్ని నిర్వాసితులను చేసేటట్లయితే వారికి ఒక సమూహంగానే తాము ఎంచుకునే చోట అన్ని పౌర సదుపాయాలతో

పునరావాసం ఏర్పాటు చేయాలనేది మరొక సూత్రం. ఈ చర్యలకయ్యే ఖర్చు ప్రాజెక్టు లేక ప్రణాళిక ఖర్చులో భాగంగా ఎంచి ప్రభుత్వము లేక ఆ ప్రాజెక్టు చేపట్టే సంస్థ దానికి జవాబుదారు కావాలి.

గడిచిన 60 సంవత్సరాలలో దేశంలోని వివిధ ప్రాజెక్టుల కింద దాదాపు ఆరు కోట్ల ప్రజానీకం నిర్వాసితులయ్యారని గ్రహించినప్పుడు, ఒక పునరావాస హక్కు అనేదే లేకుండా ప్రజలను దేశ అభివృద్ధి పేరిట తమ ఆవాసాల నుండి గెంటి వేస్తున్న భారత ప్రభుత్వం ఎంతటి అమానుషత్వానికి పాల్పడుతున్నదో అర్థమవుతున్నది. పైగా ఆ ఆరు కోట్ల నిర్వాసితులలో 40 శాతం ఆదివాసీలు. అంటే పునరావాస హక్కు అనేదేదీ లేకుండా 'అభివృద్ధి' చేసుకుంటూ పోతున్న భారత పాలకులు దేశంలోని అత్యంత బలహీన వర్గాలను దేశ ప్రగతికి బలి చేస్తున్నారు. ప్రగతి దేశానిది కాగా విస్థాపన నిర్వాసితుల స్వంతభారమైంది. ఈ స్థితి ఎంతమాత్రం కొనసాగడానికి వీలులేదు. ఒక సమగ్రమైన పునరావాస చట్టాన్ని ప్రవేశపెట్టబోతున్నట్లు కేంద్ర ప్రభుత్వం నుండి మనం పదే పదే వింటున్నాం గాని ఇప్పటికింకా అది కార్యరూపం దాల్చలేదు. దీనికోసం గట్టిగా కృషి చేయడం ప్రజాతంత్ర ఉద్యమం ముందున్న కర్తవ్యం.

## 2. నీటి హక్కులో సమతుల్యం:

మొదటి రాష్ట్ర మహాసభలైన కొద్ది రోజులకే రాష్ట్రప్రభుత్వం తలపెట్టిన జలయజ్ఞం మీద వివరమైన కరపత్రం వేశాము. జలయజ్ఞం అప్పటికి ఒక సంవత్సర కాలంగా నడుస్తున్నది. 65 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ హామీ (ఇప్పుడు ఆ హామీ ఒక కోటి ఎకరాలకు పెరిగింది) ఎంత మేరకు అమలయ్యింది అనే కోణం నుండి కాకుండా నీటి హక్కును ఏవిధంగా పంపిణీ చేస్తున్నారు అన్న కోణం నుండి మనం చూశాము. నీటి మీద అన్ని ప్రాంతాలకు అన్ని ప్రజా వర్గాలకు సమాన హక్కు ఉండాలి అనేది మన అవగాహన. వర్షాభావ ప్రాంతాలకు, భూ గర్భ జలాలు తక్కువ ఉన్న ప్రాంతాలకు నదీ జలాల కేటాయింపు (భౌతిక సాధాసాధ్యాల పరిధిలో) ఎక్కువ చేయడం సమతుల్యాన్ని సాధించడానికి ఒక మార్గం. ప్రాజెక్టులు చేపట్టేటప్పుడు కూడా కరువు ప్రాంతాలకు నీరిచ్చే వాటిని మొదట చేపట్టడం అవసరం. కొత్త నీటి కేటాయింపులేవీ అవసరం లేకుండా ఆదిలాబాద్, అనంతపురం, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రయోజనాల కోసం చేపట్టగల మూడు ప్రాజెక్టుల ఊసే జలయజ్ఞంలో లేకపోవడాన్ని ఎత్తిచూపాం. పెన్‌గంగ మీద మహరాష్ట్ర నిర్మించిన ప్రాజెక్టు ఖర్చులో 12 శాతం మనం భరించినట్లయితే ఆదిలాబాద్ జిల్లా అవసరాల కోసం 40వేల ఎకరాలకు నీళ్లు తీసుకోవచ్చునని మహరాష్ట్ర ఎప్పటినుండో చెబుతున్నది. ఆ పైసలు వాళ్లకిచ్చి ఒక కాలువ తవ్వుకుంటే సరిపోతుంది. ఈ ప్రతిపాదన జలయజ్ఞంలో ఎందుకు లేదని మనం ప్రశ్నించాం. తుంగభద్ర డ్యామ్‌లో పూడిక వల్ల ఎగువ కాలం సామర్థ్యం బాగా పడిపోయి అనంతపురం జిల్లాలోని ఆయకట్టు బాగా దెబ్బతినింది. అయితే ఎగువకాలువ కర్ణాటకకు కూడా నీళ్లిస్తుంది కాబట్టి ఇది రెండు రాష్ట్రాలకు సమస్యే. ఖర్చు ఇద్దరూ భరించి ఒక సమాంతర కాలువ తవ్వుకుందామని కర్ణాటక ఎప్పటి నుండో సూచిస్తున్నది. ఈ ప్రతిపాదన కూడా జలయజ్ఞంలో లేదు. మహబూబ్‌నగర్ జిల్లాలో 87వేల ఎకరాలకు నీటిని ఇవ్వాల్సిన రాజోలిబండ మళ్లింపు పథకానికి మరమ్మతులు లేక ఆ ప్రాజెక్టు అందులో మూడో వంతు భూమికి కూడా నీళ్లివ్వడం లేదు. జలయజ్ఞంలో ఈ ప్రాజెక్టు మరమ్మతు ప్రస్తావన ఎందుకు లేదని ప్రశ్నించాం.

జలయజ్ఞంలో దాచిపెట్టిన సత్యాలను కూడా ప్రశ్నించాం. ఉత్తరాంధ్రలోని ప్రతిపాదిత ప్రాజెక్టులేవీ ఒరిస్సాతో నీటి పంపిణీ ఒప్పందం జరుగకుండా సాధ్యం కావు. ఒప్పందం సాధ్యం కాకపోతే అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం కింద కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయించుకోవాలి. 50 ఏళ్లుగా మన రాష్ట్రాన్ని ఏలుతున్న వాళ్లు ఈ రెండు ప్రయత్నాలు చేయకుండా ఉత్తరాంధ్ర వాసులకు సాగునీటి హామీలు ఇచ్చుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. జలయజ్ఞం చేపట్టిన తర్వాతనైనా ఆ పనికి ప్రాధాన్యమిచ్చి చేయవలసింది. అవేవీ లేకుండా 25వేల ఎకరాల ఆయకట్టు కోసం కట్టిన జంఝావతి ప్రాజెక్టును 7వేల ఎకరాలకు కుదించి రబ్బరు డ్యామ్ తెచ్చి పెట్టి జలయజ్ఞంలో మొదటి విజయంగా ప్రకటించుకున్నారు. వంశధార స్టేజ్-2 రిజర్వాయర్, కాలువలు పూర్తి స్థాయిలో కడుతున్నారు గాని, ఒరిస్సా అభ్యంతరాలు పరిష్కరించుకోలేదు కాబట్టి దానికీ ఏదో ఒక రోజు జంఝావతికి పట్టించిన గతే పట్టిస్తారు.

నికర జలాల కేటాయింపు లేకుండా కృష్ణాజలాలపైన ఆధారపడ్డ దక్షిణ తెలంగాణ, రాయలసీమ ప్రాజెక్టులకు వేలకోట్లు కేటాయించడాన్ని ఆ నాడు వేసిన కరపత్రంలో విమర్శించాం. అప్పటికే నియమించబడిన రెండవ కృష్ణాజలాల ట్రిబ్యునల్ ముందుకు పోయి నికర జలాల కేటాయింపు ఏదో ఒక మేరకు తెచ్చుకుని ఆ మేరకు మాత్రమే ప్రాజెక్టులు కట్టుకోవడం ఉచితంగా ఉంటుందని అన్నాము. ఆ తర్వాతి పరిణామం ఏమిటంటే రాష్ట్ర ప్రభుత్వం రెండవ కృష్ణా జలాల ట్రిబ్యునల్ ముందుకు పోయి ఈ ప్రాజెక్టులకు నికర జలాలు అడగబోమని హామీ ఇచ్చి వచ్చింది. ఆ హామీ రేపు ట్రిబ్యునల్ ఇవ్వబోయే అవార్డులో భాగమవుతుంది. అంటే ఈ అవార్డు గడువు కాలం (అది మొదటి కృష్ణ ట్రిబ్యునల్ అవార్డు లాగా 30 సంవత్సరాలు ఉండవచ్చు, ఇంకా ఎక్కువ కాలం ఉండవచ్చు) యావత్తూ ఆ ప్రాజెక్టులకు నీటి హక్కులుండవు, అడగడానికి అవకాశం ఉండదు. కరువు ప్రాంతాలకు ఇంతకంటే అన్యాయముండదు. ట్రిబ్యునల్ విచారణ ఇంకా పూర్తి కాలేదు కాబట్టి ప్రజల నుండి వత్తిడి ఉన్నట్లైతే రాష్ట్ర ప్రభుత్వం తన హామీని వెనక్కు తీసుకోవడానికి ఇంకా సమయముంది. మనం ఈ ప్రతిపాదిత ప్రాజెక్టులన్నింటినీ సర్వే చేశాము. త్వరలో దానిపైన ఒక బుక్‌లెట్ ప్రచురించి ప్రజల నుండి ఈ ఒత్తిడి తీసుకురావడానికి కృషి చేయాలి.

గోప్యంగా ఉంచిన మరొక విషయాన్ని కూడా కరపత్రంలో ప్రస్తావించాము. జలయజ్ఞంలోని ప్రాజెక్టులు- ముఖ్యంగా తెలంగాణ, రాయలసీమలకు నీళ్లు ఈయనవలసినవి- అధిక భాగం ఎత్తిపోతల ప్రాజెక్టులు. వీటి నిర్వహణకు ఎప్పటికప్పుడు కరెంటు ఖర్చవుతుంది. జలయజ్ఞంలోని ఎత్తిపోతల పథకాలన్నింటికీ సాలీనా అవసరం అయ్యే కరెంటు రాష్ట్రంలోని రైతులందరూ బోర్లకు, మోటార్లకు వాడుకునే కరెంటు కంటే ఎక్కువ ఉండబోతుంది. ఈ ఖర్చు రైతులు పెట్టుకోలేరు. ప్రభుత్వం పెట్టుకుంటుందా?, బోర్లకు ఇస్తున్న కరెంటు సబ్సిడీని తగ్గించుకోడానికి మార్గాలు వెతుకుతున్న ప్రభుత్వం ఈ ఖర్చు పెట్టుకుంటుందా? లేక ఈ

అవసరం కోసమే ఒక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు కట్టబోతారా? ఈ చర్చ ఏమీ చేయకుండా వేల కోట్లు కుమ్మరించి ఎత్తిపోతల ప్రాజెక్టులు కట్టుకుంటూ పోతే చివరికి ఏం దక్కుతుంది? ఈ ప్రశ్నలు వేసి మనం ఆనాడే చర్చకుబెట్టాం.

ఆ తర్వాతి కాలంలో రాష్ట్రప్రభుత్వం కృష్ణా,గోదావరి నదుల జలాలపైన తెలంగాణ, రాయలసీమలకు నీరు ఈయవలసిన పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన న్యాయబద్ధమైన నీటి హక్కుల నిర్ధారణ, ప్రాధాన్యతల నిర్ణయం చేయకుండా ఏకపక్షంగా వ్యవహరించడం కరువు ప్రాంతాల మధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టే పరిస్థితి తీసుకువచ్చింది. ఇది రాష్ట్ర రాజకీయాల్లో ప్రజాస్వామ్య వాతావరణాన్ని బాగా ధ్వంసం చేసింది. గోదావరి జలాలను కృష్ణ బేసిన్‌కు తరలించడం చాలా రకాలుగా అవాంఛనీయమనీ కృష్ణాజలాల పునః పంపిణీ ద్వారా-ఆ నది జలాలపైన ఆధారపడిన పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి కరువు ప్రాంతాలకు నీళ్లివ్వడం ఉచితంగా ఉంటుందనీ మనం అంటున్నాం. దీనిని వివరించే ప్రచురణ ఇప్పటికే తీసుకురావల్సి ఉండింది. కాని పని భారం వల్ల జరుగలేదు. పైన చెప్పినట్లు సర్వే పూర్తి చేశాము కాబట్టి ప్రచురణ త్వరలో తీసుకు రాగలము.

అయితే హేతుబద్ధంగా, న్యాయబద్ధంగా వాడుకోగలిగిన మేరకు నదీ జలాలను ప్రాజెక్టుల ద్వారా వాడుకోవడం సరి అయినదే అయినప్పటికీ అదే సర్వం గాదు. నదీ జలాలు అందలేని ప్రాంతాలు చాలా ఉన్నాయి. మన రాష్ట్రంలో ఎప్పటినుండో ఉనికిలో ఉన్న చెరువుల వ్యవస్థను బాగుచేయడం, కాపాడడం, హేతుబద్ధమైన సాగునీటి విధానంలో అంతర్భాగంగా ఉండాలి. అటువంటి విధానమేదీ లేదన్న విషయం 2005 వర్షాకాలంలో అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షాల ఫలితంగా బయటపడింది. వందలాది చెరువులు కట్టలు తెగి నీళ్లు వృధా అయ్యాయి, పొలాలు పంట భూములు ధ్వంసమయ్యాయి. నల్గొండ జిల్లా వలిగొండ వద్ద ఒక రైలు కొట్టుకుపోయి వందకు పైగా ప్రయాణీకులు చనిపోయారు. మనం నల్గొండ, నెల్లూరు, ప్రకాశం, కృష్ణ, వరంగల్ జిల్లాల్లో జరిగిన చెరువుల విధ్వంసంపైన సర్వే జరిపి చెరువుల వ్యవస్థ నిర్వహణలోని ఘోర వైఫల్యమే ఈ విధ్వంసానికి కారణమని ఎత్తి చూపుతూ వివరమైన ప్రకటనలు ఇచ్చాం. నీటిపారుదల వ్యవస్థల సక్రమ నిర్వహణ కోసం 1997లో చేసిన చట్టాన్ని దాని అమలులోని వైఫల్యాన్ని వివరిస్తూ ఈ సందర్భంగా ఒక ప్రచురణ తీసుకువస్తే ఉపయోగకరంగా ఉండేది. ఆ పని చేయలేకపోవడం మన వైఫల్యమే.

### 3. నక్సలైట్ ఉద్యమంపైన నిర్బంధం:

మానవ హక్కుల వేదిక ఏర్పడిన కొత్తలో, ప్రతీ ఎన్‌కౌంటర్ ఘటన గురించి నిజ నిర్ధారణ కమిటీ వేయడం అనవసరమని, ఘటన స్వభావం తీవ్రతను బట్టి అవసరం అనిపించినట్లయితేనే నిజ నిర్ధారణ చేయాలని అనుకున్నాం. ఉదాహరణకు గ్రామంలో ఉంటూ సాయుధ చర్యలతో ఏ సంబంధం లేకుండా సాధారణ జీవితం గడుపుతున్న వ్యక్తులను చంపిన ఘటనలోనే నిజనిర్ధారణ జరిపాం. అయితే క్రమంగా పరిస్థితి మారి గడిచిన రెండేళ్లకు పైగా దాదాపు అన్ని ఎన్‌కౌంటర్ ఘటనల మీద నిజ నిర్ధారణ చేస్తున్నాం. దీనికి రెండు కారణాలున్నాయి.

2004లో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు నెలల పాటు ప్రభుత్వానికి, (అప్పటి) పీపుల్స్‌వార్ పార్టీకి మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉండేది. ఒక దఫా చర్చలు జరిగాయి. రెండవ దఫా చర్చలు జరగవలసి ఉండగా అకస్మాత్తుగా 2005 జనవరి నెలలో ఎన్‌కౌంటర్‌లు మళ్లీ మొదలయ్యాయి. చర్చల ప్రక్రియను భగ్నం చేసే ఘటనలుగా వీటికి ప్రాముఖ్యం ఉండడం వల్ల ప్రతీ సంఘటన జరిగిన స్థలానికి వెళ్లి వాస్తవాలు వెలికి తీసి చర్చలను ఇక అసాధ్యం చేసే ఉద్దేశ్యంతో ఈ హత్యలకు పాల్పడుతున్నారని వివరించడం అవసరం అనుకున్నాము. ఆ పని చేశాము.

అదే సమయంలో, ఎ.పి.సి.ఎల్.సి. బాధ్యులు పురుషోత్తమ్, ఆజమ్ అలీల హత్యలు, లక్ష్మణ్, బిచ్చారెడ్లపైన దాడి, 2005 సెప్టెంబర్‌ల నుండి కోబ్రాల ఆవిర్భావం, మహబూబ్ నగర్ ప్రకాశం జిల్లాల్లో ప్రజాతంత్ర ఉద్యమ కార్యకర్తలు కనకాచారి, మన్నెం ప్రసాద్, మునయ్యల హత్యల పర్యవసానంగా తెలంగాణ జిల్లాలోనూ ఎన్‌కౌంటర్ జరిగే ఆంధ్ర జిల్లాలోనూ కూడా వేరే ఎవ్వరూ మాట్లాడలేని పరిస్థితి ఏర్పడింది. ఎన్‌కౌంటర్‌ల గురించి మనమైనా నిజ నిర్ధారణ చేయకపోతే పోలీసుల కథనమే సత్యంగా నిలిచిపోయే ప్రమాదముంది. అందువల్ల కూడా వీలైనంత వరకూ అన్ని ఎన్‌కౌంటర్ ఘటనల మీద నిజ నిర్ధారణ కమిటీ వేయడం మొదలు పెట్టాం. 10 జూన్ 2006 నాటి కార్యవర్గంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుని సర్క్యులర్ పంపడం కూడా జరిగింది.

కొన్ని సందర్భాలలో మనం ఎ.పి.సి.ఎల్.సి. మిత్రులతో కలిసి ఎన్‌కౌంటర్ ఘటనలపైన నిజ నిర్ధారణ చేస్తున్నాం. ప్రత్యక్ష సాక్ష్యులు చూస్తుండగా పట్టుకుపోయి చంపిన ఘటనల విషయంలో ఇటువంటి ఉమ్మడి నిజ నిర్ధారణల వల్ల ఇబ్బంది ఏమీ ఉండడం లేదు గాని, దట్టమైన అడవులలో ఏ సాక్ష్యులు లేని చోట జరిగిన ఘటనల గురించి ఉమ్మడి నిజ నిర్ధారణ కమిటీ వేసినప్పుడు కొంత ఇబ్బందికరమైన పరిస్థితి ఎదుర్కోవడం జరుగుతున్నది. అటువంటి ఘటనలు జరిగినప్పుడు మనం ఏం జరిగి ఉంటుందో ఊహాత్మకంగా నిర్ధారించే ప్రయత్నం చేయడం కంటే, చట్టపరంగా జరగవలసిన చర్యలను నొక్కి చెప్పడం ముఖ్యం. ఒక హత్య చేసిన వారు తాము ఆత్మరక్షణలో చేశామని ప్రకటించి తప్పించుకోడానికి వీలు లేదని, వారి ప్రకటన ఆధారంగానే వారిమీద హత్య కేసు నమోదు చేసి నిష్పాక్షికంగా నేర పరిశోధన జరపాలని, హత్య ఆత్మరక్షణలో జరిగిందా లేదా అనేది కోర్టులో తేలాలని చెప్పడం అవసరం. పోలీసుల కథనానికి మన ఊహలు ఎదురొడ్డడం కంటే ఇది ముఖ్యం. మత్తుమందు పెట్టి చంపారా, విషమిచ్చి చంపారా అన్న ఊహాత్మకమైన చర్చ చేయడం అవసరమని మనతో కలిసి వచ్చేవారు భావించినట్లయితే ఉమ్మడి నిజ నిర్ధారణలో కొంత ఇబ్బంది ఉంటున్నది. ఉమ్మడి నిజ నిర్ధారణ చేసేటప్పుడు ఈ విషయాన్ని ముందే స్పష్టపరచుకుని బయలుదేరడం మంచిది.

అయితే చట్టం పరిధిలోనే ఇంకొక ప్రశ్న వేయవలసిన అవసరం ఇవాళ కనిపిస్తున్నది. ఈ మధ్యకాలంలో ఎక్కువగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నది గ్రేహౌండ్స్ దళాలు. దట్టమైన అడవుల్లోకి పోయి మావోయిస్టుల ఆచూకీ నిర్దిష్టంగా తెలుసుకుని వారిని చుట్టుముట్టి కాల్చి చంపుతున్నారు. గ్రే హౌండ్స్ చేస్తున్న ఈ ప్రాణాంతకమైన దాడుల వల్ల మావోయిస్టులను ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనంతగా అదుపు చేయగలిగిందన్న అభిప్రాయం పాలకుల్లో ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ పోలీసు యంత్రాంగం సృష్టించిన గ్రేహౌండ్స్‌నుదేశ ప్రధాన మంత్రి స్వయంగా పొగుడుతూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా పేర్కొంటున్నాడు. కానీ ఈ సృష్టి చట్టబద్ధమైనదా? గ్రేహౌండ్స్‌ను అస్సాల్ట్ టీమ్ (Assault Team) అని మాజీ డి.జి.పి. స్వరణ్‌జిత్‌సేన్ వర్ణించేవాడు. దాడి చేసి చంపే లక్ష్యంతో ఒక పోలీసు బృందాన్ని తయారు చేసే అధికారం చట్టం ప్రభుత్వానికిచ్చిందా? చట్టం పోలీసులకిచ్చిన బలప్రయోగ అధికారం రక్షణ కోసం ఉద్దేశించిందే తప్ప దాడి కోసం కాదు. సాధారణ చట్టాలకు, కల్లోలిత ప్రాంతాల చట్టం, సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం మొదలైన ప్రత్యేక చట్టాలకు ఉండే తేడా ఇదే. ఆ ప్రత్యేక చట్టాలకిందనైతే దాడి చేసే లక్ష్యంతో బలప్రయోగం చేసే అధికారం పోలీసులకు, సైనిక బలగాలకు ఉంటుంది గాని, సాధారణ చట్టంలో రక్షణార్థం మాత్రమే బలప్రయోగం చేయొచ్చు - అంటే గ్రేహౌండ్స్ సృష్టే చట్టవిరుద్ధమైనది. ఈ అభిప్రాయాన్ని మనం అటువంటి ఘటనలు జరిగినప్పుడు వేసిన నిజ నిర్ధారణ కమిటీల నివేదికలలో ప్రకటిస్తున్నాం. అయితే దీనిని మరింత విస్తృతంగా ప్రచారంలో పెట్టాల్సిన అవసరం ఉంది.

ఎన్‌కౌంటర్‌ల గురించి నిజ నిర్ధారణ చేపడుతున్నాం గాని ప్రచారం పెద్దగా చేయడం లేదన్న చర్చ వచ్చింది. అయితే ఎన్‌కౌంటర్ జరిగినప్పుడు పోలీసులపైన హత్య కేసుపెట్టి విచారించాలన్న మన వాదన హైకోర్టు ఫుల్‌బెంచ్ ముందుకు పోయింది. ఫుల్‌బెంచ్ విచారణ పూర్తయింది. మన వాదనతో ఏకీభవిస్తున్నట్లు న్యాయమూర్తులు సూచనప్రాయంగా చెప్పారు. కాని తీర్పు ఇంకా వెలువడలేదు. తీర్పు రాగానే దానిని విస్తృతంగా ప్రచారంలో పెడతాము.

కాగా, మన రాష్ట్రంలో 'కోబ్రాల' పేరుమీద ప్రైవేటు హంతక ముఠాల హత్యాకాండ, పొరుగు రాష్ట్రమైన చత్తీస్‌ఘడ్‌లో 'సల్వాజుడుం' సృష్టి ఈ రెండు సంవత్సరాల కాలంలో ప్రభుత్వ అణిచివేత విధానాలకు సంబంధించిన ప్రముఖ ఉదంతాలు. 'కోబ్రాల' పేరుమీద వ్యవహరిస్తున్న హంతకులు కొత్తవారు కాకపోవచ్చు. అంతకు ముందు 'గ్రీన్‌టైగర్స్' పేరు మీద, ఏ పేరు లేకుండా, వ్యవహరిస్తున్న వారే కావొచ్చు. అయితే వరుసగా జరిగిన కనకాచారి హత్య(24 ఆగస్టు 2005), మన్నెం ప్రసాద్ హత్య (10 సెప్టెంబర్ 2005), కిలింగరావు హత్య )14సెప్టెంబర్ 2005), మునయ్య హత్య (28 నవంబర్ 2005) ప్రజాతంత్ర ఉద్యమ కార్యకర్తలలోనూ, మేధావి వర్గంలోనూ విపరీతమైన భయాన్ని రేపింది. ఉత్తర తెలంగాణ జిల్లాలోనే కాక ప్రజా ఉద్యమాలు కొన్ని సంవత్సరాల పాటు బలంగా పనిచేసిన మహబూబ్‌నగర్, ప్రకాశం జిల్లాల్లోనూ ఎవరూ నోరు ఎత్తలేని పరిస్థితి నెలకొనింది.

ఈ హంతకులెవరు, వారికి పోలీసులకు మధ్య ఉన్న సంబంధం ఏమిటి అన్న దానిలో రహస్యమేమీ లేదు. వీళ్లలో కొందరు తెల్లబట్టల పోలీసులు. తక్కిన వాళ్లు ఒకప్పుడు నక్సలైట్ ఉద్యమంలో పనిచేసి బయటకు వచ్చి తమ పూర్వ సహచరుల మీద ద్వేషం పెంచుకుని పోలీసులతో చేతులు కలిపిన వ్యక్తులు. వారు పోలీసుల పహారాలో బతుకుతూ ప్రజా సంఘాల్లో పనిచేస్తున్న వారిని బెదిరించి బలవంతంగా రాజీనామా చేయిస్తూ, పనిలో పనిగా బలవంతపు పంచాయతీలు తదితర మార్గాల ద్వారా ఆస్తులు సంపాదించుకుంటున్నారు. వాళ్లు చేసిన ఏ ఒక్క హత్యపైనా పోలీసు కేసు లేదు, నేర పరిశోధన లేదు.

మనమీ కోబ్రాల దౌర్జన్యాల గురించి ఎప్పటికప్పుడు పత్రికా ప్రకటనలు ఇవ్వడమే గాక రాష్ట్ర హోంమంత్రిని రెండుసార్లు కలిసి వారి నేరాలను అరికట్టే చర్యలు చేపట్టమని డిమాండ్ చేశాము. క్రాంతి సేనతో మొదలై కోబ్రాల దాకా వచ్చిన ప్రైవేటు హంతక ముఠాల వ్యవహారంపైన వివరమైన నోట్‌రాసి దేశంలోని అన్ని హక్కుల సంఘాలకు పంపించాము. రాష్ట్ర ప్రభుత్వానికి నిరసన లేఖలు రాయమని, రాయించమని వారిని కోరాము. ఉద్దేశ్యపూర్వకంగా కోబ్రాల విషయంలో ఏ చర్యా తీసుకోకపోవడం ద్వారా సమాజంలో ఒక వర్గానికి తెలిసి హాని కలిగిస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఇంటెలిజెన్స్)ల పైన లోకాయుక్తలో విరసం బాధ్యుడు చలసాని ప్రసాద్ వేసిన ఫిర్యాదులో సాక్ష్యాలు సేకరించి విచారణ సక్రమంగా జరిపించే బాధ్యత మనమే తీసుకున్నాం. దానిని నిర్వర్తిస్తున్నాం. ప్రాథమిక విచారణ పూర్తయ్యింది, ఫిర్యాదు అడ్మిట్ చేసుకునేది లేనిదీ లోకాయుక్త ఆర్డర్ జారీ చేయాల్సి ఉంది.

నక్సలైట్ ఉద్యమంపైన వివిధ రూపాల్లో అమలవుతున్న నిర్బంధానికి వ్యతిరేకంగా నిరసన తెలిపేటప్పుడు మనం మానవ హక్కుల కోణం నుండి మాట్లాడాలే తప్ప రాజకీయ కోణం నుండి మాట్లాడడం మన కర్తవ్యాన్ని నష్టం చేస్తుందని గుర్తించడం వల్ల, వివిధ ప్రజా సంఘాలు ఏర్పరచిన ఐక్య కార్యాచరణ కమిటీలో మనం చేరలేదు. మనం చేయగలిగింది విడిగా చేస్తున్నాం. వారి కార్యక్రమాలను సౌహార్ద ప్రతినిధులుగా పాల్గొంటున్నాం.

## 4. సామాజిక వివక్ష, అణచివేత:

దళితులు, స్త్రీలు ఎదుర్కొంటున్న అణచివేత విషయంలో ఎప్పటికప్పుడు వారికి అండగా ఉంటూ కేసులు నమోదయ్యేటట్లు చూడడం, ముద్దాయిలను పోలీసులు అరెస్టు చేసేటట్లు చూడడం, దళితుల విషయంలోనైతే చట్టం ప్రకారం అందవలసిన నష్టపరిహారం అందేటట్లు చూడడం, కేసు పెట్టినందుకు బాధితుల పైన నిందితులు ప్రయోగించగల కక్ష సాధింపును ఎదుర్కోవడం - ఇది ఈ వర్గాలకు మనం చేయగల ముఖ్యమైన సహాయం. కొన్ని జిల్లా కమిటీలు ఈ పనిపైన శ్రద్ధ పెట్టి చేస్తున్నాయి. ప్రత్యేకించి కర్నూలు జిల్లా కమిటీ ఆదోని ప్రాంతంలో తన దృష్టికి వచ్చిన ఇటువంటి అన్ని సమస్యలకూ స్పందించి ఈ ఆందోళనను చివరి దాకా తీసుకుపోతున్నది. కడప జిల్లా కమిటీ ప్రొద్దుటూరు ప్రాంతంలో స్త్రీలకు సంబంధించి ఇటువంటి ప్రయత్నమే చేస్తున్నది.

(P.T.O.)

నల్గొండ, వరంగల్ జిల్లా కమిటీలు కూడా ఈ రంగంలో కొంత కృషి చేస్తున్నాయి. ఈ కర్తవ్యాన్ని మరింత సమర్థంగా పట్టుదలగా నిర్వర్తించడం అన్ని జిల్లా కమిటీలు అలవర్చుకోవాలి.

అంతర్జాతీయ మహిళా దినమైన మార్చి 8 నాడు మహిళా సంఘాలతో కలిసి మహిళల స్థితిగతుల గురించి, హక్కుల గురించి ప్రచార కార్యక్రమం చేపట్టే సంప్రదాయాన్ని వరంగల్, మిర్యాలగూడ పట్టణాల్లో మన బాధ్యులు ప్రతీ సంవత్సరం అమలు చేస్తున్నారు. అన్ని జిల్లాల్లోనూ ఈ పని చేస్తే బాగుంటుంది.

గృహ హింసను 1983లో నేరస్మృతి నేరంగా గుర్తించిన తర్వాత కుటుంబంలోపల జరిగే హింసపైన పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టే అవకాశం స్త్రీలకు మొట్టమొదటిసారి దక్కింది. అయితే హింస జరిగిన తర్వాత కేసు పెట్టే అవకాశం ఉంటే చాలదని, హింసను నివారించే న్యాయ ప్రక్రియ కూడా అవసరమని భావించి పార్లమెంటు 2006లో కొత్త చట్టం చేసింది. ఆ చట్టం రూపొందించడంలో ప్రముఖ మహిళా ఉద్యమ కార్యకర్తల భాగస్వామ్యం ఉండడం వల్ల మహిళా సంఘాల అనుభవానికి, అవగాహనకు అందులో చోటు లభించింది. ఆ చట్టాన్ని ఉపయోగించుకోడానికి బాధిత స్త్రీలకు సహాయపడడం మన కర్తవ్యం. మొట్టమొదటి చర్యగా ఆ చట్టాన్ని వివరిస్తూ కరపత్రం వేసి విస్తృతంగానే పంచాము. ఆ చట్టం అమలులో న్యాయవాదులకూ కొంత పాత్ర ఉండగలదు కాబట్టి, మన సభ్యులు చాలామంది న్యాయవాదులు కాబట్టి, ఇక మీదట మన కర్తవ్యాన్ని ఫలవంతంగా నిర్వర్తిస్తామని ఆశిద్దాం.

రిజర్వేషన్ల విషయంలో న్యాయస్థానాల వైఖరిని తీవ్రంగా విమర్శించాల్సిన అవసరం ఈ రెండేళ్లలో చాలాసార్లు వచ్చింది. ప్రైవేటు విద్యా సంస్థలలో రిజర్వేషన్లు ఇమ్మని ప్రభుత్వం ఆదేశించడానికి వీలు లేదంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధం అని విమర్శిస్తూ వివరమైన కరపత్రం వేశాము. సమ్మె హక్కు విషయంలో న్యాయస్థానాలు అనుసరిస్తున్న వైఖరిని విమర్శిస్తూ అదే కాలంలో ప్రచురించిన మరొక కరపత్రాన్ని కూడా కలుపుకుని న్యాయస్థానాలలోని అప్రజాస్వామిక ధోరణుల పట్ల నిరసన తెలుపుతూ కరీంనగర్, విశాఖపట్నం, నల్గొండ, అనంతపురం, వరంగల్, మలికిపురంలలో బహిరంగ సభలు నిర్వహించాం. నిరుడు కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యా సంస్థలలో ఒ.బి.సి.లకు రిజర్వేషన్లు ఇవ్వబోతున్నట్లు ప్రకటించగానే ఉత్తర భారతదేశంలో అగ్రకులాలు ఖరీదైన ఉద్యోగాలిచ్చే చదువులమీద తమ గుత్తాధిపత్యాన్ని వదులుకోవడం ఇష్టం లేక ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా 'రిజర్వేషన్-వ్యతిరేక ఆందోళన ఏ ప్రయోజనాల కోసం?' అన్న శీర్షికతో కరపత్రం వేసి పొన్నూరు, విశాఖపట్నం, నల్గొండ, కాకినాడ, అనంతపురంలలో సభలు నిర్వహించాం.

చివరికి కేంద్రప్రభుత్వం ఉన్నత విద్యా సంస్థలలో ఒ.బి.సి.లకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేయనే చేసింది. దాని మీద సుప్రీంకోర్టు అహేతుకంగా స్టే విధించడమే కాక, ఆ కేసును రాజ్యాంగ ధర్మాసనం ముందు ఉంచింది. ఇందులో కొత్త విషయం ఏముందని రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించారంటే, కులం ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించవచ్చునా అని సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు సందేహం వచ్చిందన్నారు. ఇది ఎప్పుడో పరిష్కారమైపోయిన సందేహం కాదా అని అడిగితే ప్రభుత్వ ఉద్యోగాలలో కులం ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇయ్యవచ్చునని గతంలో న్యాయస్థానాలు అన్నాయి గాని అది విద్యాలయాలలో సీట్లకు వర్తిస్తుందా అన్న సందేహం తమకు వచ్చిందన్నారు. నిజానికి రెండు రకాల రిజర్వేషన్లు కులం ప్రాతిపదికన ఈయవచ్చునని న్యాయస్థానాలు ఎప్పటినుండో అంటున్నాయి. ఇప్పుడు కొత్తగా రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించవలసిన అవసరమేమీ లేదు - జాప్యమే లక్ష్యమైతే తప్ప.

ముస్లిమ్‌లకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జారీ చేసిన చట్టాన్ని కొట్టేసిన మన రాష్ట్ర హైకోర్టు తీర్పును సమీక్షిస్తూ ఒక కరపత్రాన్ని వేయాలనుకున్నాం గాని, దానిపైన సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వమూ, ముస్లిమ్ సంస్థలు వేసిన అప్పీల్ పైన విచారణ వెనువెంటనే జరుగుతుందన్న అభిప్రాయం రాష్ట్ర ప్రభుత్వం కలిగించడం వల్ల సుప్రీంకోర్టు ఏమంటుందోనని చూద్దామని ఆగాం. అయితే ఆ విచారణ ఇప్పటిదాకా జరుగలేదు. ముస్లిమ్‌లలో వెనుకబాటు తనాన్ని నిర్ధారించేందుకు మన రాష్ట్ర బి.సి. కమిషన్ సమగ్రమైన నివేదిక ఇవ్వలేదన్న అభ్యంతరం సరైనదే. వేగంగా చట్టం చేసేసి ముస్లిమ్‌ల కృతజ్ఞత పొందాలన్న ముఖ్యమంత్రి ఆరాటానికి లొంగి బి.సి. కమిషన్ కొంచెం హడావుడిగా తన నివేదికను ఇచ్చేసింది. ప్రత్యేకించి ముస్లిమ్‌లు ఏయే వృత్తులలో ఏమేరకు పని చేస్తున్నారో సూచించే ఎంప్లాయిమెంట్ ప్రొఫైల్ తయారు చేయడానికి శాస్త్రీయమైన ప్రయత్నం చేయలేదు. సాంకేతిక అభివృద్ధికి ఎక్కువగా ఆస్కారం లేని సంప్రదాయక వృత్తులలో అధికంగా చిక్కుకుని పేదరికం అనుభవిస్తున్న వర్గాన్ని వెనుకబడిన వర్గంగా గుర్తించవచ్చునని న్యాయస్థానాలు అనేక సందర్భాలలో చెప్పి ఉన్నాయి. ఇది ముస్లిమ్‌లకు చక్కగా అతుకుతుంది. మనం బి.సి. కమిషన్‌కు విచారణకు హాజరై ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకువచ్చి దీనిని రుజువు చేసే గణాంకాలు సేకరించినట్లయితే కమిషన్ చేసే సిఫారసుకు తిరుగు ఉండదని చెప్పాం. కాని బి.సి. కమిషన్ ఛైర్మన్‌గారు రాజశేఖరరెడ్డిని మెప్పించే తొందరలో ఆ కృషి చేయకుండా ముస్లిమ్‌ల ఉపాధి ప్రొఫైల్ గురించి జర్నలిస్టు పద్ధతిలో 'నేను ఏ ఊరికిపోయి చూసినా ముస్లిమ్‌లు సైకిళ్ల పంచర్లు వేస్తూ, టీ అమ్ముతూ, తోపుడు బండ్ల వ్యాపారం చేస్తూ కనిపించారు' అంటూ రాసుకొచ్చారు.

హైకోర్టు ఈ ఒక్క కారణంగా ముస్లిమ్ రిజర్వేషన్ చట్టాన్ని కొట్టేసి, బి.సి. కమిషన్ సమగ్రమైన విచారణ జరిపిన తర్వాత మళ్లీ నిర్ణయం తీసుకొమ్మని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించి ఉంటే పెద్దగా అభ్యంతరం చెప్పడానికి ఏమీ ఉండేదిగాదు. కాని హైకోర్టు అక్కడితో ఆగిపోకుండా చట్టరీత్యా చాలా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసింది. రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వ చర్యల రాజ్యాంగబద్ధతనే కాక, ఔచిత్యాన్ని సహితం సమీక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉంటుందనింది. ముస్లిమ్‌లు ఉప వర్గాలుగా

చీలి ఉన్నారని, వారి జీవన విధానంలో వెనుకబాటు తనానికి సంబంధించిన సూచికలు చాలా కనిపించినప్పటికీ ముస్లింలకు ఒక వర్గంగా రిజర్వేషన్లు ఇవ్వడానికి వీలులేదని, క్రీమీలేయర్ తొలగించినంత మాత్రాన ఈ లోపం తొలగిపోదని అనింది. ప్రభుత్వం చేసిన చట్టం ఒక మతం వారికి మొత్తంగా రిజర్వేషన్లిచ్చే రాజకీయ ఎత్తుగడకు అచ్ఛాదన మాత్రమే అనింది. చట్ట సభలు చేసే చట్టాలకు దురుద్దేశాలు ఆపాదించే అధికారం న్యాయస్థానాలకు లేదని హైకోర్టు మర్చిపోయింది. సుప్రీంకోర్టులో అప్పీల్‌పైన విచారణ త్వరగా జరుగుతుందని నమ్ముకోకుండా హైకోర్టు తీర్పుపైన విమర్శ వెంటనే ప్రచురించి ఉంటే బాగుండేది.

## 5. పర్యావరణం, కాలుష్యం:

ఈ కోవకు చెందిన అనేక సమస్యలు మనం వివిధ జిల్లాల్లో చేపట్టినప్పటికీ ఒక కడప జిల్లా యురేనియం గని విషయంలో మాత్రమే ఫాలోఅప్ కొంతమేరకు చేయగలిగాం. ఆదిలాబాద్ కరీంనగర్ జిల్లాల్లో సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనులు, గుంటూరు జిల్లా పిడుగు రాళ్లలో సున్నపుబట్టీలు, విశాఖపట్నం పరిసరాలలో వివిధ పరిశ్రమలు కలిగించే కాలుష్యాన్ని గురించి నిజ నిర్ధారణ కమిటీలు వేశాము, ప్రకటనలు చేశాము. అయితే పెద్దగా ఫాలోఅప్ చేయలేకపోయాం.

కడప జిల్లా తుమ్మలపల్లి యురేనియం ప్రాజెక్టు గురించి మాత్రం గతంలో నల్గొండ జిల్లా పెద్దగట్టు యురేనియం ప్రాజెక్టు విషయంలో చేసినట్లు బాగానే ఆందోళన చేయగలిగాము. ఇతర ప్రజా సంఘాలను కలుపుకుని ఐక్య కార్యాచరణ కమిటీని వేశాము. పర్యావరణ ఉద్యమకారుల సహాయంతో యురేనియం గనుల వల్ల కలుగ గల తీవ్ర ప్రమాదాలను సంబంధిత గ్రామాలలో మన కార్యకర్తలు బాగా ప్రచారం చేశారు. అది వై.ఎస్. కుటుంబం జాగీరు అయిన పులివెందుల ప్రాంతం కావడం వల్ల, వై.ఎస్. ఆ ప్రాజెక్టును తీసుకురావడం తన ప్రెస్టేజ్‌కు సంబంధించిన విషయంగా భావించడం వల్ల బయటి వారి అండ లేకుండా స్థానిక ప్రజలు దానిని వ్యతిరేకించజాలరు. ఆ అండ కొంతమేరకు మనం ఇవ్వగలిగాము. వై.ఎస్. వివేకానందరెడ్డి స్వయంగా రంగంలోకి దిగి ప్రజలను బెదిరించి భయపెట్టి వారిలోని వ్యతిరేకతను నీరుగార్చే ప్రయత్నం చేసినప్పటికీ ప్రజలు ఒక దశ వరకూ గట్టిగానే నిలబడ్డారు. పర్యావరణ చట్టాల కింద జరుగవలసిన బహిరంగ విచారణకు మనం, పర్యావరణవాదులు, సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం). బాధ్యులు, ఇతర ప్రజా సంఘాల బాధ్యులు హాజరయ్యాము. సంబంధిత గ్రామాల ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అయితే వై.ఎస్. వివేకానందరెడ్డి అప్పటికే బయటి జనాన్ని పెద్ద ఎత్తున సమీకరించి సభాస్థలాన్ని పూర్తిగా ఆక్రమించుకుని బాధిత గ్రామాల ప్రజలకు చోటు లేకుండా చేశాడు. బహిరంగ విచారణ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తున్న జిల్లా కలెక్టర్ కిమ్మనకుండా చోద్యం చూస్తున్నాడు. ప్రాజెక్టును వద్దన్నవారిని మాట్లాడనివ్వకుండా ఆ గుంపు అల్లరి చేసే సరికి మనం కార్యక్రమాన్ని బహిష్కరించి వచ్చేశాము.

ఈ దౌర్జన్యాన్ని నిరసిస్తూ కాలుష్యనియంత్రణ బోర్డుకు అర్జీ ఇచ్చి, తిరిగి విచారణ జరపమని కోరినా ప్రయోజనం లేకుండా పోయింది. హైకోర్టు కూడా పునర్విచారణ జరపాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. కనీసం ఒక వివరమైనా కరపత్రం వేద్దామన్న ఆలోచనకు ఐక్య కార్యాచరణ కమిటీలోని ఇతర సంఘాలు సిద్ధంగా లేకపోవడం వల్ల అదికూడా జరుగలేదు. ప్రచురించని ఆ కరపత్రాన్ని మన 8వ బులిటెన్‌లో అచ్చువేశాము.

## 6. రైతుల, నేతపనివాళ్ల ఆత్మహత్యలు:

రైతుల ఆత్మహత్యల గురించి మనం ఒక దశలో చాలా కృషి చేశాము. చాలా ఘటనల వివరాలు సేకరించి ఆత్మ హత్యలకు గల కారణాలు విశ్లేషించి ప్రచారం చేశాము. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జయతిఘోష్ కమిటీకి సహకరించి మన అభిప్రాయాలు తెలియజేశాము. ఆ కమిటీ నివేదికను ప్రభుత్వం అటకెక్కించిన వైనాన్ని విమర్శించాం.

జయతిఘోష్ కమిటీ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోయినా మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చే జి.ఒ. నెంబర్ 421ని జారీ చేసింది. అప్పుల వాళ్లకు సర్దడానికి రూ. 50వేలు, కుటుంబానికి ఒక లక్ష రూపాయలు ప్రభుత్వం ఇస్తుంది. ఎమ్మార్వోలు గ్రామంలో కూర్చుని అప్పుల వాళ్లను పిలిచి ఆ 50 వేల రూపాయలను పంచి దానితో సంతృప్తి పడమని చెబుతారు. చట్టపరంగా అటువంటి ఆదేశం జారీ చేసే అధికారం ప్రభుత్వానికి లేదు కాబట్టి వారు నిజంగా సంతృప్తి చెందడం లేదు. కొన్నాళ్లు ఆగి ఆ కుటుంబాన్ని మళ్లీ సతాయిస్తున్నారు. మృతుడి భార్య ఈ వేధింపును ఎదుర్కొంటూ భర్త విడిచిపెట్టిన వ్యవసాయాన్ని కొనసాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. వారి స్థితి గతుల గురించి సర్వే జరపాలనుకున్నాం గాని జరుగలేదు.

అయితే జి.ఒ. నెం. 421 అమలే అస్తవ్యస్థంగా ఉంది. మృతుడు తీసుకున్న అప్పు వ్యవసాయ సంబంధమైన అవసరాల కోసమే అయి ఉండాలని ఆ జి.ఒ. అంటోంది. ఈ సంగతి తెలియని కుటుంబ సభ్యులు ఏయే అవసరాల కోసం మృతుడు అప్పు తీసుకున్నాడని అధికారులు అడిగితే కుటుంబం ఎదుర్కొన్న ఆర్థిక సమస్యలన్నిటినీ ఏకరువు పెడుతున్నారు. లేదా ఆ సమయంలో తమకు ప్రధానమని తోచిన ఆర్థిక అవసరాన్ని నొక్కి చెబుతున్నారు. అధికారులు దీనిని నమోదు చేసుకుని ఈ కేసు జి.ఒ. నెంబర్ 421 కిందకు రాదని రిపోర్టు రాస్తున్నారు. భర్త రోగిష్టి అయి ఉండి భార్య వ్యవసాయం చూసుకుంటూండి అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటే ఆమె పట్టాదారు కాదని చెప్పి నష్టపరిహారం నిరాకరిస్తున్నారు. నష్టం మీద నష్టం వచ్చిన రైతు భూమి అమ్మేసి వేరే పని చేసుకునే ప్రయత్నం చేసి అది కూడా సాగక ఆత్మహత్య చేసుకుంటే చనిపోయిన నాటికి అతను రైతు కాడని చెప్పి నష్ట పరిహారం నిరాకరిస్తున్నారు.

మనం జి.ఒ. నెంబర్ 421 గురించి రైతులలో అవగాహన కలిగించాలని నష్ట పరిహారం అన్యాయంగా నిరాకరించిన సంఘటన

(P.T.O.)

వివరాలను సేకరించి పునః పరిశీలన జరిపి నష్ట పరిహారం ఇమ్మని జిల్లా కలెక్టర్‌ను కోరాలని అనుకున్నాం. ఇది కొన్ని జిల్లాల్లో కొంత మేరకు అమలయ్యింది. మెదక్ జిల్లాలో ఈ సంవత్సరం నష్ట పరిహారం నిరాకరించిన కొన్ని కేసులలో తిరిగి ఇప్పించమని మనం కోరిన మేరకు పునర్విచారణ చేపట్టినట్లు కలెక్టర్ నుండి వర్తమానం అందింది. మెదక్ జిల్లా కమిటీ కొన్ని సందర్భాలలో మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం కూడా అందించింది.

రైతుల ఆత్మహత్యలు ఆగే సూచనలేమీ కనబడడం లేదు కాబట్టి శాశ్వత పరిష్కారాన్ని ప్రభుత్వం అన్వేషించే సూచనలూ కనబడడం లేదు కాబట్టి జి.ఒ. నెం. 421 గురించి అవగాహన కలిగించే కర్తవ్యాన్ని, అది సక్రమంగా అమలయ్యేట్టు చూసే కర్తవ్యాన్ని మనం చురుగ్గా చేపట్టాలి. జయతిఘోష్ కమిటీ రిపోర్టు పూర్తిగా అమలు చేయమని రాష్ట్ర ప్రభుత్వంపై వొత్తిడి తెచ్చే ఆందోళన చేపట్టాలి.

నేత పనివారి ఆత్మహత్యలు కూడా తరచుగా వార్తల్లో ఉంటున్నాయి. కరీంనగర్ జిల్లా సిరిసిల్లపట్టణంలో మరమగ్గాల కార్మికుల ఆత్మహత్యల గురించి మనం నిజ నిర్ధారణ కమిటీ వేశాము. 1997 -2006 మధ్య పది సంవత్సరాలలో ఆ ఒక్క ఊరిలోనే 209 మరమగ్గాల కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అంటే సంవత్సరానికి సగటున 20 మంది అని అర్థం. మరమగ్గాలమీద తయారయ్యే బట్ట అమ్మగా వచ్చిన ఆదాయాన్ని చాలామంది పంచుకోవాలి. నూలు కొని 'బీం' తయారు చేసే మాస్టర్ వీవర్, ఆ బీం తీసుకుని కూలీ వాళ్లను పెట్టి బట్ట నేయించే జాబ్ వర్కర్, జాబ్ వర్కర్ వద్ద పనిచేసే కార్మికుడు, తయారైన బట్టను వ్యాపారం చేసే హోల్‌సేలర్లు, కమిషన్ ఏజెంట్లు, రీటైల్ దుకాణాదారులు - ఈ దొంతర పోనిదే అందరికంటే కింద ఉన్న కార్మికునికి జరుగుబాటు ఉండదు. వారు నెలకు రెండువేల రూపాయలు సంపాదించగలిగితే ఎక్కువ. బీడీలు చుట్టే భార్య ఇంకొక 500 రూపాయలు సంపాదించినా అప్పులు చేయకుండా కుటుంబం గడవదు. ఆ అప్పు పెరిగేదే తప్ప తరిగేది కాబట్టి ఇక భరించలేమనుకున్న రోజు కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారు.

రైతుల ఆత్మహత్యలకు సంబంధించి జి.ఒ. నెంబర్ 421 జారీ చేసినట్లే నేత కార్మికుల ఆత్మహత్యలకు సంబంధించి 2006 ఫిబ్రవరి నెలలో రాష్ట్ర ప్రభుత్వం జి.ఒ. నెంబర్ 46 జారీ చేసింది. ఇది జి.ఒ. నెంబర్ 421 లాగా డొంకతిరుగుడు భాష ప్రయోగించదు. స్పష్టంగానే ఉంది. అంతేగాక ఈ జి.ఒ. అమలుకొచ్చే నాటికి సిరిసిల్ల ఆర్డీవోగా ఉన్న అధికారి మృతులైన నేత కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలన్న ఆరాటం గల వ్యక్తి. అయినప్పటికీ 209 కేసులలో 105 తిరస్కరించబడ్డాయంటే ప్రభుత్వ విధానాలకు, జీవిత వాస్తవాలకు మధ్య ఎంత ఎడం ఉందో అర్థమవుతుంది. మనం తిరస్కరించబడిన కేసుల వివరాలు సేకరించి పునః పరిశీలించమని అధికారులను కోరే కార్యక్రమం చేపట్టాము. 35 కేసుల వివరాలు మన జిల్లా కమిటీ ఇప్పటికే సేకరించి ఆర్డీవోకి ఇచ్చింది. ఆయన పునః పరిశీలన జరపలేదు గాని వేరే ఏదో ఒక ఖాతా నుండి ఒకొక్క కుటుంబానికి రూ. 25వేలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

## 7. ఖైదీల హక్కులు:

శిక్ష పడిన ఖైదీల శిక్షా కాలాన్ని తగ్గించి ముందుగా విడుదల చేసే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఒ. నెంబర్లు 314, 315లను నిరాధారమైన అభ్యంతరాల కారణంగా వెనక్కు తీసుకోవడాన్ని నిరసిస్తూ మనం ఖైదీల బంధుమిత్రులను, ఇతర ప్రజా సంఘాలను కలుపుకుని ఆందోళన చేశాము.

శిక్ష పడిన ఖైదీల నడవడికను, వారి కుటుంబ పరిస్థితులను, వారి వయస్సును, ఆరోగ్యాన్ని తదితర ప్రమాణాలను లెక్కలోనికి తీసుకుని శిక్ష కాలాన్ని తగ్గించి ముందుగా విడుదల చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఇది రాష్ట్రపతికి, గవర్నర్‌కు రాజ్యాంగమే ఇచ్చిన అధికారం. నేర విచారణ స్మృతిలోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ అధికారముంది. దాని వినియోగానికి జైలు నియమావళి ఒక వ్యవస్థను ఏర్పాటు చేసింది. వివిధ అధికారులతో కూడిన ఒక సలహా బోర్డు ఉండాలి. ఆ బోర్డు మూడు నెలలకొకసారి శిక్ష పడిన ఖైదీలు పూర్తి చేసిన శిక్షా కాలాన్ని, వారికి దక్కిన రెమిషన్‌ను, వారి ఆరోగ్య పరిస్థితిని, వయస్సును, ఇతర విషయాలను లెక్కలోకి తీసుకుని విడుదల చేయగల ఖైదీల జాబితాను ప్రభుత్వానికి ఇవ్వాలి. ప్రభుత్వం దానిపైన తగు చర్య తీసుకోవాలి.

ఈ సలహా బోర్డు వ్యవస్థ మన రాష్ట్రంలో అసలు పనిచేయడం లేదు. ప్రభుత్వాలు బుద్ధి పుట్టినప్పుడు జి.ఒ.లు జారీ చేసి ఖైదీల శిక్షలు తగ్గించి విడుదల చేయడం అలవర్చుకున్నాయి. 3 నెలలకొకసారి జరగవలసిన ప్రక్రియ సంవత్సరానికో, కొన్ని సంవత్సరాలకో జరుగుతుండడం వల్ల ఖైదీలు చట్టపరమైన హక్కులు కోల్పోతున్నారు. రాష్ట్రప్రభుత్వం నిరుడు నవంబర్ 1 సందర్భంగా జారీ చేసిన జి.ఒ. నెం. 314, 315 అటువంటి ఆదేశాలు. చట్టపరంగా చేయవలసిన పనిని ప్రభుత్వం అసలే ఆలస్యంగా చేస్తుండగా, ఇదంతా కొందరు కాంగ్రెస్ నాయకుల అక్రమ విడుదల కోసం చేస్తున్న కుట్ర అంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆంధ్రజ్యోతి, ఈనాడు దినపత్రికలు పెద్ద ఎత్తున రచ్చచేశాయి. ప్రతిపక్షాలు, పత్రికలు న్యాయమైన అభ్యంతరం చెప్పినప్పుడు పట్టించుకోని వై.ఎస్. ప్రభుత్వం అర్థరహితమైన ఈ విమర్శను సీరియస్‌గా తీసుకున్నట్లు ప్రకటించి ఆ రెండు జి.ఒ.లను నిలుపుదల చేస్తూ జి.ఒ. నెం. 12 జారీ చేసింది.

దీనికి నిరసనగా మనం ఖైదీల బంధుమిత్రులను, ఇతర ప్రజా సంఘాలను కలుపుకుని ధర్నాలు సభలు నిర్వహించాము. హైదరాబాద్, వరంగల్, రాజమండ్రి, కడప, విశాఖపట్నం, విజయవాడలలో ఈ కార్యక్రమాలు జరిగాయి. హోం మంత్రిని,

ముఖ్యమంత్రిని కలిసి జి.ఒ. నెంబర్లు 314, 315లను నిలుపుదల చేయడం అన్యాయమని వివరించాము. త్వరలో వాటిని అమలు చేస్తామని వారు హామీ ఇచ్చారు గాని అది జరుగలేదు. మహాసభలు అయిపోయిన తర్వాత ఈ ప్రయత్నాన్ని మనం కొనసాగించాలి. నిజానికి ఈ జి.ఒ.లను నిలుపుదల చేయకముందే వాటిని కుదించే ప్రయత్నం జైలు అధికారులు చేశారు. ఖైదీ జైలులో గడిపిన శిక్షా కాలాన్ని లెక్కించేటప్పుడు రిమాండ్‌లో గడిపిన కాలాన్ని పరిగణనలోకి తీసుకోమని అన్నారు. మనం హోం మంత్రితో మాట్లాడిన తర్వాత రిమాండ్ కాలాన్ని కూడా లెక్కించాలని ప్రభుత్వం స్పష్టపరుస్తూ మెమో జారీ చేసింది.

అయితే కేవలం జి.ఒ నెంబర్ 314, 315ల అమలు గురించే కాక జైలు నియమావళి ప్రకారం సలహాబోర్డు వ్యవస్థను పునరుద్ధరించి, 3 నెలలకొకసారి ఖైదీల విడుదలకు శిఫారసులు పొందాలని మనం డిమాండ్ చేస్తున్నాం.

## 8. ఏజెన్సీలో బాక్సైట్ గనులు:

విశాఖపట్నం ఏజెన్సీలో ఉన్న బాక్సైట్ ఖనిజాన్ని తవ్వి తీయాలన్న సంకల్పాన్ని మన రాష్ట్రాన్ని ఏలుతున్న వారు దాదాపు 10 సంవత్సరాలుగా వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో బాక్సైట్‌గనుల లీజు విదేశీ ప్రైవేటు కంపెనీలకు ఇవ్వాలన్న ఆలోచన చేశారు. ఏజెన్సీలో భూములను గిరిజనేతరులకు లీజుకు ఇవ్వడం 'సమత' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాజ్యాంగ విరుద్ధం అని మనమప్పుడు ఆందోళన చేశాము. దాంతో తెలుగుదేశం పాలకులు న్యాయమైన సలహా తీసుకుని కాబోలు రాజ్యాంగాన్నే సవరించే ప్రతిపాదన పెట్టారు. చంద్రబాబు నాయుడు పెట్టిన ఒత్తిడి మేరకు కేంద్ర గనుల శాఖ రాజ్యాంగం 5వ షెడ్యూల్‌ను సవరించే ప్రతిపాదన రూపొందించింది కూడా.

తెలుగుదేశం ప్రభుత్వం ఓడిపోవడంతో ఈ ప్రయత్నం వెనకడుగు వేసింది కానీ వారి స్థానంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు వేరే అడ్డదారి వెతుక్కున్నారు. గనుల లీజు ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఇచ్చి ఖనిజాన్ని తవ్వి తీసి జిందాల్‌కు రస్ అల్ ఖైమా అనే అరబ్ సంస్థానానికి అమ్ముతారట. వారు ఏజెన్సీ బయట ఖనిజాన్ని శుద్ధి చేసి అల్యూమినా తయారు చేస్తారట.

ఎ.పి.ఎం.డి.సి. ప్రైవేటు కంపెనీలకు బినామీగా వ్యవహరించడం చట్టవిరుద్ధం అన్న సంగతి అటుంచి, ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకం ఆదివాసీల ఉనికిని బాగా దెబ్బతీస్తుంది. బాక్సైట్ ఖనిజం లోయలలో ఉండదు. ఎత్తైన కొండల పై భాగాన ఉంటుంది. అక్కడ ఖనిజం తవ్వకానికి లీజుకిచ్చేది ఆవాసాలు లేని భూమినే అయినా, దాని ప్రభావం దిగువన లోయలలోని ఆవాసాల మీద తీవ్రంగా ఉంటుంది. అంతేగాక ఉత్తరాంధ్రలోని అనేక నదుల 'కాచ్‌మెంట్' ఈ కొండలలో ఉంది. ఆ నదుల ప్రవాహమూ తీవ్రంగా దెబ్బతింటుంది.

పొరుగున ఉన్న ఒరిస్సా రాష్ట్రంలోని రాయగడ, కొరాపుట్ జిల్లాల్లో ఆదివాసీల తీవ్ర అభ్యంతరాల నడుమ చేపడుతున్న బాక్సైట్ తవ్వకం విశాఖపట్నంలో రాగల పరిణామాలను తెలుపుతుంది. మనం ఆ ప్రాంతానికి ఒకటికి రెండుసార్లు పోయి వచ్చాము. ఎన్జీవోలు నిర్వహించిన ప్రజా విచారణలో పాల్గొన్నాము.

ఈ సమస్యపైన వివరమైన నివేదకను ప్రచురించాలన్న నిర్ణయం తీసుకుని చాలా కాలమైంది. పనుల వత్తిడివల్ల అది అమలు కాలేదు. మహాసభలు ముగిసిన వెంటనే మొదటి కర్తవ్యంగా ఆ నివేదికను ప్రచురిస్తాము. అయితే ఈలోపల బాక్సయిట్ వ్యతిరేకంగా ఆదివాసీ సంఘాలు చేపడుతున్న ఆందోళనల్లో పాల్గొంటున్నాము. నిజానికి బాక్సైట్ ఉంది కాబట్టి తవ్వితీసి అమ్ముకుందామన్న తపనే తప్ప బాక్సైట్ నుండి వచ్చే అల్యూమినియం లోహం అదనంగా ఉత్పత్తి చేయడం భారతదేశానికి ఇప్పుడు అత్యవసరమేమీ కాదు. మన అవసరాలకు తగిన అల్యూమినియం ఉంది. ఒరిస్సా కొత్తగా తవ్వితీస్తున్న ఖనిజాన్ని అల్యూమినా (అల్యూమినియం ఆక్సైడ్) రూపంలో ఎగుమతి చేస్తున్నారే తప్ప అల్యూమినియం లోహాన్ని ఉత్పత్తి చేయడం లేదు. అమెరికా యుద్ధ పరిశ్రమకు అల్యూమినియం అవసరం అని తొందరపడుతున్నారే తప్ప వేరే కారణం లేదు.

ఈ సందర్భంలో, ఆదివాసీ ప్రజలు నిర్వాసితులు కాకూడదన్న మొండివాదనతో అన్ని రకాల ఖనిజాల తవ్వకాన్ని వ్యతిరేకిస్తామా అన్న ప్రశ్న వస్తుంది. దీనికి చాలా స్థాయిలలో జవాబులు చెప్పవచ్చు. కొన్ని రకాల ఖనిజాల తవ్వకాలను ఆదివాసీ సహకార సంఘాలకే లీజుకు ఇచ్చి దాని ప్రాసెసింగ్ కూడా వారికే నేర్పించిన సందర్భాలున్నాయి. ఉదాహరణకు విలువైన రంగురాళ్లు మన రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లానుంచి ఒరిస్సా దాకా ఖనిజం రూపంలో దొరుకుతాయి. వాటిని అశాస్త్రీయంగా వెలికితీసే ప్రయత్నం చేసి ఆదివాసుల చనిపోయిన సందర్భాలు చాలా ఉన్నాయి. వారికి సరైన శిక్షణ ఇచ్చి సహకార సంఘాలు ఏర్పాటుచేసి ఆ సంఘాలకే రంగురాళ్ల వెలికితీత అప్పగించాలన్న పాలసీ ఉభయ రాష్ట్రాలలోనూ ఉంది. (మన రాష్ట్రంలో ఒక ప్రమాదంలో చనిపోయిన వ్యక్తి కుటుంబీకులు హైకోర్టులో కేసు వేసిన తరువాత ఈ పాలసీ ఉనికిలోకి వచ్చింది. ఒరిస్సా ప్రభుత్వం సొంతంగానే ఈ ఆలోచన చేసింది). మన రాష్ట్రంలో ఇది సరిగా అమలు కావడంలేదు గానీ ఒరిస్సాలో బాగా అమలవుతున్నది, ఆదివాసీ సహకార సంఘాలు సమర్థంగా నిర్వహించి మంచి ఆదాయాన్ని పొందుతున్నాయి.

రంగురాళ్ల తవ్వకం కంటే లోతైన సాంకేతిక ప్రక్రియ ఉపయోగించే ఖనిజాల విషయంలో ఇది ఇప్పుడే సాధ్యమవుతుందా అన్న ప్రశ్న రావచ్చు. దానికి కావలసిన నైపుణ్యం ఆదివాసీ యువకులలో కొందరైనా పొందేవరకు ఎందుకు ఆగకూడదు? ప్రయత్న పూర్వకంగా వారికి ఆ నైపుణ్యం ఎందుకు అందించకూడదు?

## 9) గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు:

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, దానికింద జారీ అయిన ఉపాధి హామీ పథకం చాలా ప్రాముఖ్యాన్ని కలిగినవి. వీటివల్ల భారతదేశంలో మొట్టమొదటిసారిగా ప్రజలకు పనిహక్కు లభించింది. ప్రస్తుతమిది ఎంపిక చేసిన జిల్లాలకే, అందులోనూ గ్రామీణ ప్రాంతాలకే వర్తిస్తుంది. సంవత్సరంలో వందరోజులకు మాత్రమే పనిహక్కుకు గ్యారంటీ ఇస్తుంది. ఈ పరిమితులన్నీ ఉన్నప్పటికీ ఇది చెప్పుకోదగ్గ మార్పు. ఈ పథకాన్ని ప్రజలు నిజంగా అందుకోవడానికి మనవంతుగా సహాయం చేయడం మన కర్తవ్యం అనుకున్నాం. మన రాష్ట్రంలో మొదటి పథకం కింద 11 జిల్లాలు, ఆ తరువాత మరో ఆరు జిల్లాలు ఈ పథకం కిందికి వచ్చాయి. మన కర్తవ్యంలో భాగంగా ఈ పథకం అమలుతీరును పరిశీలించే పనిని చేపట్టాం. నల్గొండ, కర్నూలు, వరంగల్, ప్రకాశం జిల్లాలలో మనం చేపట్టిన పరిశీలనలో ఇది పనిహక్కు కల్పించే పథకం అని అధికారులు ప్రజలకు చెప్పడం లేదని గమనించాం. పనివున్నప్పుడు పిలిచే కరువు పనుల పథకం లాంటిదన్న అభిప్రాయం వారు కలిగిస్తున్నారు. పని కావల్సిన వారు అర్జీ పెట్టుకోవాలని, పెట్టుకున్నవారికి రెండు వారాలలోగా పని చూపించకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలని, దీనికోసం సంబంధిత అధికారులు ప్రతీ గ్రామంలోనూ చేపట్టదగ్గ పనులు గుర్తించి పెట్టుకోవాలని ప్రజలకు చెప్పడం లేదు. నిరుద్యోగ భృతి ఎక్కడా ఇవ్వడం లేదు.

ఈ పథకం ప్రాముఖ్యాన్ని దృష్టిలో వుంచుకుని ఏ పని మీద మనం గ్రామాలకు పోయినా ఆ గ్రామాలలో ఉపాధి హామీ పథకం ఏ విధంగా అమలవుతుందో అడిగి తెలుసుకుని ప్రజలకు ఆ పథకం స్వభావాన్ని వివరించి చెప్పి, లొసుగులను అధికారుల దృష్టికి తీసుకుపోవాలని అనుకున్నాము. ఇది కొన్ని జిల్లాలలో మాత్రమే అమలవుతోంది. అన్ని జిల్లా శాఖలు ఈ కర్తవ్యాన్ని సీరియస్‌గా తీసుకోవాలి.

## 10) గని ప్రమాదాలు:

సింగరేణిలో జరిగిన రెండు పెద్ద గని ప్రమాదాల మీద కేంద్ర ప్రభుత్వం కోర్టు ఆఫ్ ఎంక్వయిరీ చేత విచారణ జరిపించింది. ఒకటి రామగుండం 7ఎల్.ఇ.పి. గనిలో 2003 జూన్ 16నాడు పదిహేడు మంది కార్మికుల ప్రాణాలు తీసిన ప్రమాదం. రెండవది 2003 అక్టోబరు 16, 17 తేదీల మధ్య రాత్రి పన్నెండు మంది కార్మికుల ప్రాణాలు తీసిన ప్రమాదం. కోర్టు ఆఫ్ ఎంక్వయిరీ లో ఒక హైకోర్టు న్యాయమూర్తి, ఒక రిటైర్డ్ డైరక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ, ఒక కార్మిక నాయకుడు విచారణ చేపడతారు. మనం మన సంస్థ తరపున అభియోగ పత్రాలు దాఖలు చేసి ఈ రెండు విచారణలలోనూ పాల్గొన్నాము. బొగ్గుగనుల భద్రతకు సంబంధించిన చట్టపరమైన నియమాలు అనుభవజ్ఞులైన కార్మిక సంఘాల నాయకులకు సైతం తెలియకపోవడం వలన మనం పాల్గొనడం మంచిదైంది. ప్రమాదం జరిగిన చోట ఆ రోజు బాధ్యునిగా వుండిన అధికారిని మాత్రమే కాక మొత్తంగా పైదాకా వున్న అధికారులందరినీ జవాబుదారులుగా చేయడానికి ప్రయత్నించాము. అంతేకాక అన్ని గనులు భద్రతా నియమాలననుసరించి నడుచుకునేటట్టు చూసే బాధ్యత వున్న గనుల భద్రత శాఖ అధికారులను కూడా జవాబుదారులను చేసే ప్రయత్నం చేశాం. 7 ఎల్.ఇ.పి. గని ప్రమాదాన్ని గురించి మనం ఆశించినట్టే కోర్టు ఆఫ్ ఎంక్వయిరీ తీర్పు కింది నుంచి మీది దాకా అందరి పాపాన్ని వివరంగా నిర్ధారించి అందరిమీదా శాఖాపరమైన చర్యలు తీసుకోమని ఆదేశించింది. 8 ఎ గని ప్రమాదం పైన తీర్పు వెలువడాల్సి వుంది.

## 11) ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ విచారణలు:

సమాజంలోని వివిధ కరెంటు వినియోగదారులు చెల్లించవలసిన కరెంటు చార్జీలను నిర్ధారించే ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ విచారణలలో మనం ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా పాల్గొంటున్నాం. మనమూ ఇతర ప్రజాసంఘాలు పెట్టిన వత్తిడి వల్ల కమిషన్ విచారణ కేవలం హైదరాబాద్‌లోనే కాక కొన్ని జిల్లా కేంద్రాలలోనూ జరుగుతున్నది. ప్రతిపాదిత కరెంటు రేటు వివరాలు, దాని వివరణ ఇంగ్లిషులోనే కాక తెలుగులోనూ అందుతున్నాయి. మనం కేవలం విద్యుత్ ఛార్జీలకే పరిమితం కాకుండా ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న దగాకోరు ఒప్పందాలు, విద్యుత్ రంగ ప్రైవేటీకరణ ఉత్సాహంలో విద్యుత్ చట్టాన్నే మార్చివేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడుతున్నాము. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టకుండా, అంతా మీటర్లు లేని వ్యవసాయ రంగ వినియోగమేనని వాదిస్తున్న విద్యుత్ అధికారుల బూటకాన్ని ఇతర ప్రజా సంఘాలతో కలిసి ఎండగట్టాము.

## 12) ఉద్యమాలు లేవదీసే హక్కుల సమస్యలు:

ప్రజా ఉద్యమాలు, రాజకీయ ఉద్యమాలు లేవదీస్తున్న డిమాండ్లలోని హక్కుల అంశాలను స్వీకరించి ప్రచారంలో పెట్టడం మన కర్తవ్యం అని గుర్తించి పనిచేస్తున్నాం.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష వెనుక న్యాయమైన హక్కుల కోణం ఉందని మనం మొదటి నుండి అంటున్నాం. అందులో నదీ జలాల హక్కుల విషయంలో మనం విషయసేకరణ, ప్రచారం చేపట్టాము. పులిచింతలను నీటి హక్కుల కోణం నుండి సూత్రప్రాయంగా వ్యతిరేకిస్తున్నాము. పోలవరం ప్రాజెక్టును ప్రధానంగా ఆదివాసీల హక్కుల కోణం నుండి వ్యతిరేకించినప్పటికీ, తెలంగాణ నీటి హక్కుల కోణం కూడా అందులో బలంగా ఉందని గుర్తించాం. కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం భిన్న ప్రాంతాల నీటి హక్కుల నిర్ధారణ, ప్రాధాన్యతల నిర్ణయం చేయకుండా ఏకపక్షంగా

వ్యవహరించడాన్ని వ్యతిరేకిస్తున్నాం. తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో మొత్తం ఏడు ప్రాజెక్టులు కృష్ణా నది 'మిగులు జలాల'పైన ఆధారపడి ఉండగా, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంపు ద్వారా వాటిలో కడప జిల్లా ప్రాజెక్టులకు మాత్రం నీటి భద్రత కల్పించడం తప్పని అన్నాం.

జి.ఒ. 610 అమలు కూడా హక్కుల అంశమే కాని దాని మీద మెదక్‌లో నిర్వహించిన ఒక మీటింగ్ తప్ప వేరే కార్యక్రమం చేపట్టలేదు.

ఎస్.సి. రిజర్వేషన్ వర్గీకరణను మనం మొదటి నుండి సమర్థిస్తున్నాం. అది రాజ్యాంగ విరుద్ధం అన్న సుప్రీంకోర్టు తీర్పుపై రాజ్యాంగ విరుద్ధమైనదని విమర్శించాం. ఎమ్మార్పీఎస్ అభ్యర్థన మేరకు, ఇప్పుడు రాజ్యాంగాన్ని తగు రీతిలో సవరించడం తప్ప గత్యంతరం లేదని యు.పి.ఎ. ప్రభుత్వ బాధ్యులను హైదరాబాద్‌లో కలిసి వివరించి చెప్పాము. ఆ పని చేయడానికి న్యాయ విచారణ కమిషన్ వేయవలసిన అవసరం ఉండలేదు గాని కేంద్ర ప్రభుత్వం కాలయాపన ఎత్తుగడగా ఉషామెహరా కమిషన్‌ను వేసింది. అనవసరమైన ఈ కమిషన్ కనీసం త్వరగానైనా తన నివేదిక ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు కృష్ణమాదిగ చేపట్టిన నిరాహారదీక్షకు మద్దతు పలికాం.

## 13) ఇతర రాష్ట్రాలలో హక్కుల కార్యకలాపాలు:

గడచిన రెండు సంవత్సరాలలో ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, కర్ణాటక, కాశ్మీర్‌లకు వివిధ సమస్యలపైన మనం నిజ నిర్ధారణ కమిటీలుగా వెళ్లాం.

2006 జనవరి రెండవ తేదీన కళింగనగర్ పారిశ్రామిక కేంద్రంలో టాటా స్టీల్స్ వారికి ఆ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమిని వారు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించినపుడు, నిర్వాసితులు కాబోయే ఆదివాసులు ప్రతిఘటించగా పోలీసు కాల్పులు జరిగి 12 మంది ఆదివాసులు చనిపోయారు. ఒక పోలీసు కానిస్టేబుల్ కూడా చనిపోయాడు. మనం జనవరి 13, 14 తేదీలలో అక్కడికి వెళ్లాం. ఎపిసిఎల్‌సి మిత్రులు మనతో కలిసి వచ్చారు. అంతకుముందు ఆ పారిశ్రామిక కేంద్రంలో వివిధ కంపెనీలను ఆదివాసీలు ప్రతిఘటించి వెనక్కి పంపిన ఘటనలు జరిగివున్నాయి కాబట్టి ఈసారి ఉద్దేశపూర్వకంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున పోలీసులను మోహరించి ఎంత రక్తపాతం జరిగినా పరవాలేదు, టాటా స్టీల్స్ వారి పనులు జరిగేలా చూడాలని నిర్ణయించింది. ఇది గ్రహించిన నిర్వాసితులు తమ ఉనికిని కాపాడుకోవడానికి మరింత పట్టుదలగా ప్రయత్నించేసరికి ఈ విషాదం జరిగింది.

ఈ ఘటన గురించి భువనేశ్వర్‌లో విడుదల చేసిన పత్రికా ప్రకటన తప్ప వేరే ప్రచారం ఏదీ మనం చేపట్టలేదు. అది మన లోపంగానే భావించాలి. అయితే ఒరిస్సా, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు ఆదివాసీ ప్రాంతంలో పెద్దఎత్తున ఖనిజాల వెలికితీతకు పరిశ్రమకు ఇస్తున్న అనుమతుల పట్ల ఆదివాసులలో నెలకొన్న తీవ్ర నిరసనకు కళింగనగర్ ఒక మచ్చుతునక మాత్రమే. ఆ మూడు రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 5 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి మదుపు కోసం వివిధ పెట్టుబడీదారి కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నాయని అధికార గణాంకాలే చెబుతున్నాయి. ప్రస్తుతం ఒరిస్సాలోని జగత్‌సింగ్‌పూర్ జిల్లాలో పోస్కో కంపెనీ ఉక్కు కర్మాగారానికి వ్యతిరేకంగా స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పట్టుదలగా ఆందోళన చేస్తున్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో లోహండీ గూడలో టాటావారికిచ్చిన పారిశ్రామిక అనుమతికి వ్యతిరేకంగానూ పెద్ద ఎత్తున ఆందోళన నడుస్తున్నది. ఈ మొత్తం పరిస్థితి మీద మనం వివరమైన నివేదిక తీసుకురావడం అవసరం. రాబోయే రోజుల్లో దండకారణ్య ప్రాంతంలో ఆదివాసీ ప్రజల మనగుడకు ఈ మూడు రాష్ట్రాల పారిశ్రామీకరణ ప్రయత్నాలు సవాలుగా నిలవబోతున్నాయి.

ఒరిస్సాలోని దక్షిణ జిల్లాల్లో మావోయిస్టులను ఎదుర్కొనే పేరిట ఆ రాష్ట్ర పోలీసులు, పారా మిలటరీ పాల్పడుతున్న నిర్బంధకాండలు గురించికూడా మనం నిజనిర్ధారణ కమిటీగా పోయిరావడం జరిగింది. సరిహద్దు జిల్లా అయిన మల్కన్‌గిరిలోని మోటు పోలీస్‌స్టేషన్ పరిధిలో వున్న తండిమెట్ల గ్రామం శివారులో నెలకొన్న బెంగాలీ కాందిశీకుల గ్రామమైన ఎం.వి. 78 అనే పేరుగల ఊరిలో 2006 డిశెంబర్ 22నాడు పోలీసులు ఒక మావోయిస్టు దళసభ్యుడితో పాటు ఒక గ్రామస్తుడిని కూడా కాల్చి చంపిన సంఘటన గురించి ఈ సంవత్సరం జనవరి నెలలో మనం నిజ నిర్ధారణ కమిటీగా వెళ్లివచ్చాము. ఎపిసిఎల్‌సి మిత్రులు, జార్ఖండ్ రాష్ట్ర పియుసిఎల్ మిత్రులు కలిసి వచ్చారు. విపరీతమైన పారా మిలిటరీ మోహరింపు కారణంగా అక్కడ ఊపిరాడని పరిస్థితి ఉందని గమనించాం. ఒరిస్సాలో మావోయిస్టు పార్టీపైన, ఆ పార్టీ అనుబంధ సంస్థలుగా ఆ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ప్రజాతంత్ర సంస్థలపైన కొత్తగా నిషేధం అమలులోనికి రావడం వల్ల స్థానికులెవ్వరూ నిజ నిర్ధారణ కమిటీలోకి రావడానికి సిద్ధంగా వుండలేదు. అయితే ఆ నిషేధాన్ని ప్రయోగించిన చట్టం రాజ్యాంగ విరుద్ధమని 1950లోనే సుప్రీం కోర్టు ప్రకటించిన సంగతి మనం ఒరిస్సా మిత్రుల దృష్టికి తీసుకువచ్చాం. ఆ నిషేధాన్ని సవాలు చేస్తూ ఒరిస్సా హైకోర్టులో కేసు దాఖలు చేయడానికి కావలసిన పిటిషన్ కూడా తయారుచేసిచ్చాం. ఆ కేసులో విచారణ పూర్తయింది. తీర్పు రావలసి వుంది.

ఈ రెండు సంవత్సరాల కాలంలో మనం బయట రాష్ట్రాలలో అత్యధికంగా కృషి చేసింది సల్వాజుడుం ఆవిర్భావం వల్ల ఉత్పన్నమైన మానవ హక్కుల సమస్యల గురించి. నిజానికి మనకు తెలియకుండానే సల్వాజుడుం ఆవిర్భవిస్తున్న దశలోనే మనం ఛత్తీస్‌ఘడ్‌కు పోయాం. మన ప్రథమ రాష్ట్ర మహాసభల తర్వాత కొద్దిరోజులకే, ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసులు పెద్దఎత్తున తిరగబడుతున్నారని, మావోయిస్టులు అందుకు ప్రతీకారంగా ఆదివాసులను హతమారుస్తున్నారని, ప్రత్యేకించి 2005 జూన్ 19నాడు కోత్రోపాల్ ఆదివాసులను మావోయిస్టులు అపహరించి చంపారని పత్రికలు రాశాయి. ఆందోళనకరమైన ఈ కథనాలకు మనం స్పందించి ఒక ఉమ్మడి నిజ నిర్ధారణ కమిటీగా పోయి వద్దామని దేశంలో అన్ని హక్కుల

(P.T.O.)

సంఘాలకు రాశాం. ఉద్యమకారుల హింసను విమర్శించే విషయంలో హక్కుల సంఘాల మధ్య తేడాలున్న సంగతి గుర్తిస్తున్నామని చెప్తూ, అదే సమయంలో చత్తీస్‌ఘడ్ నుంచి వస్తున్న వార్తల తీవ్రత దృష్ట్యా నిజ నిర్ధారణ కమిటీగా అందరమూ కలిసి పోగలిగితే బాగుంటుందని సూచించాము. ఓపిడిఆర్ మిత్రులు మాత్రమే కలిసి వచ్చారు. తక్కిన సంఘాలు కనీసం జవాబు కూడా రాయలేదు.

ఆ పర్యటనలో మనం గమనించింది ఏమిటంటే మావోయిస్టుల కొన్ని నిర్ణయాలపట్ల, విధానాల పట్ల ఆదివాసీ ప్రజలలో కొంత అసంతృప్తి నెలకొంది. దానిని ఆసరా చేసుకుని గుంపులను పోగుచేసి పోలీసుల అండదండలతో మావోయిస్టు సానుభూతిపరులు ఉండే గ్రామాలపైన దాడులు చేయడం, ఆ సానుభూతిపరులను బలవంతంగా లొంగదీసుకోవడం జరుగుతున్నది. దీనికి విరుగుడుగా మావోయిస్టులు కూడా తమ అనుయాయులను గుంపుచేసి ఎదురుదాడులు చేస్తున్నారు. అయితే ఒక వైపు మావోయిస్టుల ప్రత్యర్థులు జన జాగరణ్ అభియాన్ పేరిట చేస్తున్న హింస గురించి, దానికి పోలీసులు బహిరంగంగా ఇస్తున్న వత్తాసు గురించి ఏ వార్తలు రాకపోగా, మావోయిస్టులు చేస్తున్న హత్యలగురించి అతిశయోక్తులు ప్రచారం అవుతున్నాయని మనం గమనించాం.

ఈ జన జాగరణ్ అభియాన్ అనేదే సల్వాజుడుం పేరిట దేశవ్యాపితంగా సంచలనం సృష్టించింది. ప్రజలే తిరగబడి మావోయిస్టులను కొట్టి తరిమేసిన ప్రజా ఉద్యమంగా చత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వమే కాక కేంద్ర ప్రభుత్వం దానిని పొగడసాగాయి.

మనం కిందటి సంవత్సరం మే నెలలో సల్వాజుడుం గురించి నిజ నిర్ధారణ చేయడానికి చత్తీస్‌ఘడ్ వెళ్లాము. ముందు సంవత్సరం చూసిన విషయాలే మరింత పెద్ద పరిమాణంలో చూశాం. మావోయిస్టుల రాజకీయ శత్రువులకు జనాన్ని పోగుచేసి హత్యలు దాడులు గృహదహనాలు చేసే స్వేచ్ఛ ఇచ్చి చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం ఒక అంతర్యుద్ధ వాతావరణం కల్పించింది. ఈ హింస ద్వారా అడవులలోని ఆదివాసీ ఆవాసాలను ఖాళీ చేయించి బలవంతంగా రహదారి శిబిరాలలోకి రప్పించాలని చత్తీస్‌ఘడ్ పాలకుల వ్యూహం. అడవులను ఆ విధంగా ఖాళీ చేయించేస్తే మావోయిస్టులకు ప్రజలతో సంబంధాలు తెగిపోతాయని ఆ పైన పారా మిలటరీని దించి వారిని ఏరివేయవచ్చని వారి ఆలోచన. అయితే సల్వాజుడుం, పోలీసు, పారా మిలటరీ దాడులకు బెదిరి దాదాపు 50 వేల మంది శిబిరాలలోకి రాగా పది వేలనుంచి ఇరవై వేల దాకా సరిహద్దు దాటి ఆంధ్రప్రదేశ్‌లోకి వచ్చేశారు. లెక్కతెలియనంత మంది ఇటూ అటూ పోక చత్తీస్‌ఘడ్ అడవులలోనే చెట్లూ పుట్టలూ పట్టుకుని బతుకుతున్నారు.

బలవంతంగా నిర్వాసితులైన ఈ ఆదివాసీ ప్రజానీకమంతా తిరిగి తమ గ్రామాలకు పోయి బతకడానికి కృషి చేయడం అవసరమని మనం భావించాం. దానికోసం చత్తీస్‌ఘడ్ సమాజం నుంచే ఒక పౌరవేదికను రూపొందించడం ఉచితంగా వుంటుందని అనుకున్నాం. ఆ రాష్ట్రంలోని ప్రజాతంత్ర వర్గాలను కలిసి ఈ విషయమై చర్చిస్తున్నాం. ఉత్తర భారతదేశమంతటి లాగే చత్తీస్‌ఘడ్‌లోనూ మధ్య తరగతి మీద ఆర్ఎస్ఎస్ ప్రభావమే ప్రధానమైనది కావడం వల్ల ఈ కర్తవ్యం మీద వేసుకోగల ప్రజాతంత్ర వాదుల కోసం అన్వేషించడం అనుకున్నంత సులభంగా లేదు. అయినప్పటికీ మన కృషి కొనసాగిస్తున్నాం.

ఈ లోపల ఆంధ్రప్రదేశ్‌లోకి పారిపోయి వచ్చిన వారి దుర్భర స్థితిని కొంతమేరకైనా బాగుచేయడానికి వారందరికీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి కార్డులు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నాం. వారు స్థానికులు కారన్న అభ్యంతరం చెప్పకుండా వారు ఆశ్రయం పొందిన గ్రామాల సర్పంచులు వారికి ఉపాధి కార్డులు ఇవ్వాలని మన రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శిని మనం కోరగా ఆయన ఆ మేరకు సంబంధిత గ్రామల సర్పంచులకు ఆదేశాలు జారీచేయడానికి అంగీకరించారు. మనం వలస వచ్చిన చత్తీస్‌ఘడ్ ఆదివాసులు ఖమ్మం జిల్లా చింతూరు, భద్రాచలం, కూనవరం, విఆర్ పురం, చర్ల, ములకలపల్లి తదితర మండలాలలో ఆశ్రయం పొందిన గ్రామాల జాబితా సేకరించి వారికిచ్చాం.

కర్ణాటకకు చెందిన పి.డి.ఎఫ్. వారి ఆహ్వానం మేరకు గత సంవత్సరం మంగులూరు నగరంలో జరిగిన పోలీసు కాల్పుల పైన ఉమ్మడి నిజ నిర్ధారణ కమిటీలో పాల్గొన్నాం. బాబాబుడన్‌గిరి అనే దర్గా హిందువుల ప్రార్ధనా స్థలమంటూ సంఘ్ పరివార్‌వారు అల్లరి చేస్తున్న నేర్పథ్యంలో మంగులూరులో జరిగిన బంద్ సందర్భంగా పోలీసులు కాల్పులు జరిపి ఆరుగురిని చంపారు. సంఘ్ పరివార్ చేస్తున్న ఈ ప్రయత్నాన్ని కర్ణాటకకు చెందినటువంటి ప్రజాతంత్ర వాదులు బలంగా, సంఘటితంగా వ్యతిరేకిస్తున్నారు. వారి ఉద్యమానికి మా సంఘీభావం తెలుపుతున్నాం.

ఈ సంవత్సరం మే నెలలో ఏపిసిఎల్‌సి మిత్రులతోను కర్ణాటకకు చెందిన పిడిఎఫ్ మిత్రులతోను కాశ్మీర్‌కు వెళ్లి వచ్చాం. కాశ్మీర్‌లో మిలిటెన్సీ తగ్గుముఖం పట్టిందని, భారత సైన్యానిదే మిలిటెంట్ల పైన పై చేయి అయిందని కొంత కాలంగా వింటున్నాం. సైనిక బలగాల సంఖ్య తగ్గించడం గురించి సైనిక బలగాలను సరిహద్దు వద్దకు పంపడం గురించి వివిధ స్థాయిల్లో ప్రకటనలు వింటున్నాం. అయితే కాశ్మీర్‌కు పోయి చూస్తే కనిపించే వాస్తవం ఏమిటంటే మిలిటెన్సీ తగ్గిన మాట నిజమే కాని సైనిక బలగాల సంఖ్య గాని కాశ్మీరీల బతుకుమీద వారి పట్టు గాని ఏ మాత్రం తగ్గలేదు. గ్రామీణ కాశ్మీర్ ఎప్పటిలాగే సైనిక బలగాల దిగ్బంధనంలో వుంది. ప్రజలలో నిస్పృహ, నిస్తేజం చాలా వున్నాయి గాని ఆజాదీ కావాలన్న కోరిక చావలేదు. భారత, పాకిస్తాన్‌లు అమెరికా వత్తిడి మేరకు తమ ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకునేస్తాయన్న సందేహం తొలగలేదు.

చెప్పుకోదగ్గ మంచి పరిణామం ఏమిటంటే మొట్టమొదటిసారిగా ప్రభుత్వ పోషణలో వున్న మిలిటెంట్లకు వ్యతిరేకంగా ఒక ఊరిలో ప్రజలు తిరగబడ్డారు. దాదాపు 12 సంవత్సరాలుగా పాపా కిష్టవారి అనే ప్రభుత్వ అనుకూల మిలిటెంట్ చేసిన హత్యలను (అతను

(P.T.O.)

150 మందిని చంపాడని అంటారు) మౌనంగా భరించిన పాంపోర్ ప్రజలు మనం కాశ్మీర్‌కు వెళ్లిన రోజునే అతని మీద తిరగబడి సిఆర్‌పిఎఫ్ సంరక్షణలో బతుకుతున్న ఆ హంతకుడిని అరెస్టు చేయించారు. ఆ వూరి ప్రజలను మొట్టమొదట పలకరించిన హక్కుల బృందం మనదే కావడం మనకు సంతోషం కలిగించిన అంశం. వారి తిరుగుబాటు వృథాగా పోకుండా వుండడానికి హక్కుల సంఘాలు ఏమి చేయగలవనేది ఇతర రాష్ట్రాల సంస్థలను సంప్రదించి నిర్ణయిస్తాం.

# నిర్మాణం

మనం అనేక రంగాలలో ఎంతోకొంత కృషి చేస్తున్నట్టు పై నివేదిక తెలుపుతుంది. అయితే సంతృప్తికరంగా పనిచేస్తున్నామని అనలేము. మనం చేపట్టవలసిన చాలా సమస్యలు చేపట్టడం లేదు. చేపట్టినవి తరచుగా మొదటి దశవద్ద - అంటే నిజ నిర్ధారణ వద్ద - నిలిచిపోతున్నాయి. ఫాలోఅప్ సరిగా చేయలేకపోతున్నాం. ఆరు నెలలకు ఒకసారైనా తీసుకురావలసిన బులెటిన్ బాగా అలస్యంగా వస్తున్నది. 7, 8వ బులెటిన్ల మధ్య రెండు సంవత్సరాల అంతరం వుంది.

నిర్మాణంలో ఎదుగుదల కొరవడడం దీనికి ప్రధాన కారణం. ఒకటి రెండు జిల్లాలను మినహాయిస్తే మిగిలిన జిల్లాలలో సభ్యత్వం సంఖ్య, సభ్యుల చొరవ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉన్నాయి. చాలా సమస్యలకు ప్రస్తుత పాలనావ్యవస్థలో కొంతమేరకైనా న్యాయం చేకూర్చాలంటే రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలి, రాష్ట్ర మహిళా సంఘం, రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి. సంఘం, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ వంటి సంస్థలకు గాని, సంబంధిత ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు గాని ఫిర్యాదులు చేయడం, ఆ సంస్థను, ఆ అధికారిని వెంటబడి స్పందన వచ్చేటట్టు చూడడం అవసరం. సంస్థ బాధ్యులలో ఒక్క జీవన్‌కుమార్ తప్ప వేరెవరూ దీనికి సమయం కేటాయించలేకపోతున్నాం. ఇది చాలా ముఖ్యమైన పని కాబట్టి ఈ పని కోసమే ఎవరినైనా - తగిన వెసులుబాటు, అవగాహన వున్న వ్యక్తులను - సంస్థలోకి తీసుకున్నా తప్పులేదని గతంలో చాలా సార్లు అనుకున్నాం. అది జరగకపోవడం వల్ల హైదరాబాద్‌లో జరగవలసిన ఫాలోఅప్ కార్యక్రమం చాలా అసంతృప్తిగా నడుస్తున్నది. నిజ నిర్ధారణకు పోయినప్పుడు ఫలానా అధికారికో, ఫలానా సంస్థకో ఫిర్యాదు చేసి న్యాయం జరిగేటట్టు చూస్తామని బాధితులకు హామీ ఇస్తున్నాం గాని అది నూటికి తొంభై పాళ్లు అమలు కావడం లేదు. ఇది మన పనికే కాక మన విశ్వసనీయతకు కూడా దెబ్బ.

కార్యకర్తల సంఖ్యను, చొరవను ఒకటి రెండు జిల్లాలలో తప్ప పెంచుకోలేక పోతున్నాం. ప్రస్తుత సమాజంలో నిరాశ నిస్పృహ నెలకొనివుండడం, మన రాష్ట్రంలో చాలామందికి ఉత్తేజాన్నిచ్చిన విప్లవ కమ్యూనిస్టు ఉద్యమం సంక్షోభంలో ఉండడం, సామాజిక దృష్టిని, ఆదర్శాలను తృణీకరించే సంస్కృతి యువతలో బాగా పెరగడం దీనికి కారణాలు కావచ్చు. ఉన్న కొద్ది మందైనా ఉత్సాహంగా పనిచేసి ఆదర్శంగా నిలబడడం తప్ప దీనికి విరుగుడు లేదు. ఈ విషయం కూడా చాలా సార్లు అనుకున్నాం గానీ ఫలితం పెద్దగా ఉండడం లేదు. కనీసం సీనియర్ సభ్యులైనా తమ వృత్తికీ కుటుంబ బాధ్యతలకు తప్పనిసరిగా కేటాయించే సమయం మినహాయించి మిగిలిన సమయం సంస్థ కార్యకలాపాలకు పూర్తి స్థాయిలో ఇవ్వడం అవసరం. ఇది ఎవరికి వారు ఆలోచించుకుని అమలు చేయాల్సిందే. 'ఏమీ జరగదు, ఏం చేసి ప్రయోజనం లేదు' అనే నిస్పృహను సంస్థ బాధ్యులైనా అధిగమించగలగాలి. మన కృషికి తగిన స్పందన, ఫలితం తరచుగా ఉండకపోవచ్చును గాని ఏమీ చేయకపోతే ఏ ఫలితమూ ఉండదు గదా.

నిర్మాణయుతంగా పనిచేయడం కోసం జిల్లా శాఖల కార్యకర్తలంతా నిర్ణీత గడువులో తప్పనిసరిగా కలుసుకుని కార్యకర్తల సమావేశాలు జరుపుకోవాలని ఎప్పటికప్పుడు అనుకుంటూనే ఉన్నాము. అనంతపురం జిల్లాలో మాత్రమే వారానికొకసారి కార్యకర్తల సమావేశం జరుగుతున్నది. వేరే ఎక్కడా అంత కచ్చితంగా ఈ నిర్ణయం అమలు కావడం లేదు. కొన్ని జిల్లాల్లో, ఏదైనా కార్యక్రమం తీసుకున్నప్పుడు తప్ప కార్యకర్తలు కలుసుకోవడమే లేదు. ఇది కార్యక్రమాల అమలును బలహీనపరుస్తోంది. కొత్త సభ్యుల చొరవను నీరు గారుస్తుంది. అంతేగాక అభిప్రాయబేధాలు అపరిష్కృతంగా ఉండిపోయి నిర్మాణం బలహీనపడడానికి దారి తీస్తుంది.

హైదరాబాద్ నగర కమిటీ అయితే ఓ కమిటీగానే పనిచేయడం లేదు. ఎవరికి వారు విడిగా వారి బాధ్యతలు నిర్వర్తిస్తూ అప్పుడప్పుడూ సహకరించుకోవడం జరుగుతున్నది. రాజధానినగరం విపరీతంగా పెరిగిపోవడం, నగరం మధ్యభాగంలో నివసించడం సాధారణ మానవుల ఆర్థిక స్తోమతకు అసాధ్యం కావడం, విపరీతమైన ట్రాఫిక్ రద్దీ కారణంగా నగరంలో ప్రయాణం దుర్భరం కావడం - ఈ కారణాల వల్ల నెలకొకసారి కార్యకర్తల సమావేశం జరుపుకోవడం కూడా అసాధ్యంగా ఉంది. అయినప్పటికీ నెలకొకరోజు దీనికి తప్పనిసరిగా కేటాయించాలి. అది జరగకపోవడం వల్ల సంస్థలో పనిచేస్తామని ముందుకు వస్తున్న వారిని కార్యక్రమాల్లో ఇముడ్చుకోలేకపోతున్నాం.

నిర్మాణంలో ఎదుగుదల ఎంత స్వల్పంగా ఉందంటే ఈసారి ఒక్క కరీంనగర్ తప్ప వేరే ఏ జిల్లా జనరల్ బాడీ నిర్వహించకుండానే రాష్ట్ర మహాసభలు జరుపుకుంటున్నాం. ఈ పరిస్థితి ఇక మీదట ఉండకూడదు. ప్రత్యేకించి ఖమ్మం, కృష్ణ, తూర్పుగోదావరి జిల్లా కమిటీలను మెరుగుపర్చాలన్న నిర్ణయం ఏదైతే రాష్ట్ర కార్యవర్గం ఒకటికి రెండుసార్లు తీసుకుందో దానిని త్వరలో అమలుచేయాలి.

మనకు ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సభ్యులు లేరు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్‌కౌంటర్‌లకు సంబంధించిన నిజనిర్ధారణ హైదరాబాద్, నల్గొండ జిల్లా కమిటీల సభ్యులు చేస్తున్నారు. ఆదిలాబాద్‌కు సంబంధించి కరీంనగర్ జిల్లా కమిటీ చొరవ తీసుకుంటున్నది. నిజామాబాద్ జిల్లాలో మన కార్యక్రమాలు శూన్యమని చెప్పుకోవాలి. ఆదిలాబాద్‌లో మన సంస్థలో పనిచేయగల కార్యకర్తలున్నారని, కరీంనగర్, వరంగల్ జిల్లాల బాధ్యులంటున్నారు. జులై నెలలో దీనికి సమయం

(P.T.O.)

కేటాయించి ఆదిలాబాద్‌లో కమిటీ వేయాలి. శ్రీకాకుళం జిల్లా బాధ్యుల చొరవతో విజయనగరం జిల్లాలో కొంతమంది సభ్యత్వం తీసుకోడానికి ముందుకు వచ్చారు. స్తబ్ధంగా ఉన్న విజయనగరం జిల్లా కమిటీని త్వరలో మెరుగుపర్చాలి.

మన ఎజెండా అమలుకు ప్రజల్లో అవగాహన, చైతన్యం పెంపొందించడం, ప్రభుత్వం మీద పెత్తందారీ వర్గాల మీద విమర్శ బలంగా, నిర్దిష్టంగా వినిపించడం చాలా ముఖ్యం. దీనికి సభలు, సమావేశాలు, ప్రచురణలు మనకుండే సాధనాలు. బులిటెన్ క్రమం తప్పకుండా తీసుకురావడం అందుకే అవసరం. 8వ బులిటెన్ దాదాపు రెండు సంవత్సరాల తర్వాత తీసుకురావడం బాధాకరం. ఆ మధ్య కాలంలో అనేక సమస్యల మీద కరపత్రాలు వేసిన మాట వాస్తవమే గాని, కరపత్రానికి పరిమితులుంటాయి. మనం కరపత్రాలు సీరియస్‌గానే రాస్తున్నాం. వాటికి స్పందన బాగానే ఉంటున్నది. అయినప్పటికీ పూర్తి స్థాయి తాత్విక విశ్లేషణ కరపత్రంలో సాధ్యం కాదు కాబట్టి అది ప్రత్యామ్నాయం కాదు. ఇక మీదట ఆరు నెలలకు లేదా కనీసం 9 నెలలకొకసారి బులిటెన్ తీసుకురావాలి.

సభలు, సమావేశాలు కొన్ని జిల్లా శాఖలు మాత్రమే తరచుగా నిర్వహిస్తున్నాయి. వరంగల్‌లో అత్యధికంగా జరుగుతున్నాయి. ఏదైనా విషయంమీద రాష్ట్ర వ్యాపితంగా సభలు జరపాలని నిర్ణయం తీసుకున్నపుడు కొన్ని జిల్లా కమిటీలే ప్రతిసారీ స్పందిస్తున్నాయి. వరంగల్, నల్గొండ, కర్నూలు, విశాఖపట్నం, కొంతమేరకు అనంతపురం, శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జిల్లాలో స్పందన ఉంటోంది. అన్ని జిల్లా కమిటీలు స్పందించడం అలవర్చుకోవాలి. సభకు ఎంతమంది వస్తారన్నది లెక్కకాకూడదు.

పోలీసులు, గ్రీన్‌టైగర్స్, కోబ్రాల బెదిరింపులు, దాడుల ప్రభావం వరంగల్, ప్రకాశం జిల్లాల్లో వుంది. రాష్ట్ర అధ్యక్షుడు బుర్రా రాములుకు గ్రీన్‌టైగర్స్ నాయకుడు హరిభూషణ్ పేరిట బెదిరింపు ఫోన్లు చాలాకాలంగా వస్తున్నాయి. నిర్దిష్టంగా (కాలర్ నెంబరుతో సహా) ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు పట్టించుకోలేదు. ఈ విషయం హోం మంత్రి దృష్టికి పదేపదే తీసుకుపోయిన పిదప 'చర్చల' వాతావరణంలో ఆ హరిభూషణ్‌ను అరెస్టు చేశారు. అందరూ ఊహించినట్టే అతను జావేద్ అనే సస్పెండ్ అయిన పోలీస్ కానిస్టేబుల్ అని తేలింది. వరంగల్ జిల్లా కమిటీ కార్యదర్శి పున్నంచందర్ ఒక 'రౌడీ' ఎన్‌కౌంటర్‌ను ఖండించినందుకు 2006 జూన్ 7వ తేదీన తెల్లబట్టల పోలీసులు నాలుగు ఆటోలలో హనుమకొండలోని అతని ఇంటిపైన దాడిచేసి ఇంటిలోని సామానును ధ్వంసం చేసి, బీభత్సం సృష్టించారు.

ఈ ఘటనల ప్రభావం వరంగల్ జిల్లా కమిటీపైన పడలేదు కాని, ప్రకాశం జిల్లాలో పోలీసుల అణచివేత వైఖరి, కోబ్రాల బెదిరింపుల వల్ల కన్వీనర్ వేణుగోపాల్ తప్ప అందరూ పక్కకు తప్పుకునే పరిస్థితి వచ్చింది. వేణుగోపాల్‌ను కోబ్రాలు చంపుతామని బెదిరించడం, పోలీసులు పదేపదే అరెస్టు చేయడం, ఆ జిల్లాలో మన కార్యకలాపాలను దాదాపు స్తంభింపజేసింది. రాష్ట్ర కమిటీ చొరవతో తీసుకున్న ఒకట్రెండు కార్యక్రమాలు మాత్రమే అమలయ్యాయి. ఇప్పుడు పరిస్థితి కొంత మెరుగయినట్టు కనిపిస్తున్నది కాబట్టి ప్రకాశం జిల్లా కమిటీని పునరుద్ధరించే పని చేపట్టాలి.

ఉమ్మడి, ఐక్య కార్యాచరణ విషయంలో మనం గతంలో తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తున్నాం. నిర్దిష్టమైన, పరిమితమైన డిమాండ్లతో ఇతర ప్రజాతంత్ర సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. అప్పుడు కూడా మన అవగాహనకు, విశ్వసనీయతకు, స్వతంత్ర ప్రతిపత్తికి నష్టం కలగకుండా చూసుకోవడం అవసరం. 'నిర్బంధ వ్యతిరేక ఐక్య వేదిక'ల వంటి దీర్ఘకాల అజెండాగల వేదికలలో మనం భాగస్వాములం కావడం లేదు. ప్రత్యేకించి, ఏదైనా డిమాండ్‌కు రాజకీయ కోణం, హక్కుల కోణం రెండూ ఉన్నప్పుడు రెండింటి మధ్య తేడాను స్పష్టంగా గుర్తించడం, మనం ఆ డిమాండును వ్యాఖ్యానించేటపుడు ఆ తేడాను దృష్టిలో వుంచుకుని మాట్లాడడం చాలా అవసరం. హక్కుల డిమాండులను రాజకీయ కోణం నుండి వ్యాఖ్యానించే ప్రయత్నంతో గొంతు కలపడం వల్ల మనం నిర్వర్తించ గల కర్తవ్యం దెబ్బతింటుందే తప్ప ఏ ప్రయోజనమూ వుండదు.

పొరుగు రాష్ట్రాలలోని హక్కుల సంఘాలతో మనం ఎప్పుడూ కలిసి పనిచేస్తున్నాం. ఇతర రాష్ట్రాలలో నిజ నిర్ధారణకు పోయినప్పుడు అన్ని సంస్థలను మనతో కలిసి రమ్మని ఆహ్వానిస్తున్నాం. ఐతే మన విషయంలో ఇతర సంఘాల వైఖరి అట్లా లేదు. ఏ పోరాట సంస్థ అయినా తమ పోరాటంలో భాగంగా అన్యాయంగా వ్యవహరించినపుడు బహిరంగంగా విమర్శించాలన్న మన వైఖరి పట్ల అభిప్రాయ బేధం వున్న ఢిల్లీ, ముంబయి, కోల్‌కతాలకు చెందిన హక్కుల సంఘాలు మనల్ని దాదాపు బాయ్‌కాట్ చేస్తున్నాయి. మణిపూర్, ఛత్తీస్‌ఘడ్ విషయాల్లో ఉమ్మడి నిజ నిర్ధారణ కమిటీ వేయాలని ఆ సంఘాలన్నీ నిర్ణయించుకున్నపుడు ఎపిసిఎల్‌సికి సమాచారమిచ్చి మనల్ని మాత్రం బయటపెట్టారు. అయినప్పటికీ మన పాటికి మనం అన్ని ప్రాంతాలకు వెళ్లివస్తున్నాం కాబట్టి ఈ బహిష్కరణ వల్ల మనకు వచ్చిన నష్టమేమీ లేదు గానీ ప్రజాస్వామ్యాన్ని ప్రమాణంగా గల హక్కుల సంఘాల నడవడిక ఈ విధంగా ఉండడం దురదృష్టకరం. ఒక కర్ణాటకకు చెందిన పిడిఎఫ్ మాత్రమే మనతో అభిప్రాయ బేధం వున్నా కూడా కలిసి పనిచేస్తున్నది.

రాష్ట్రంలో కొన్ని ప్రత్యేక సమస్యలమీద మనమే చొరవ తీసుకుని విశాలమైన వేదికలను ఏర్పాటుచేసి వాటి ద్వారా పనిచేయాలని గతంలో ప్రయత్నించాం. సింగరేణి గనుల విషయంలో 'సేవ్ సింగరేణి', హైదరాబాద్ పాతబస్తీలో హక్కుల దృక్కోణంనుండి పనిచేయడానికి 'హైదరాబాద్ జంహూరీ ఫోరం', కృష్ణా జలాల విషయంలో 'కృష్ణా జలాల పునఃపంపిణీ ఉద్యమం' అనే మూడు వేదికలను ఏర్పాటు చేశాం. అయితే ఏ పేరు పెట్టినా ఆచరణలో పనిభారం అంతా మనదే అయింది. ఒక్క కృష్ణా జలాల విషయంలోనే మహబూబ్ నగర్ కు చెందిన కరువు వ్యతిరేక పోరాట కమిటీ కలిసి వచ్చింది. అయితే నర్సాకోబ్రాల ఆవిర్భావం తరువాత ఆ కమిటీ రద్దు కావడంతో అందులో కూడా మనమొక్కరమే మిగిలాం. కాబట్టి ఈ ప్రయోగాలు ప్రస్తుతానికి నిలిపివేసి

(P.T.O.)

ఆ సమస్యలమీద మానవ హక్కుల వేదికగానే పనిచేస్తున్నాం.

## ముగింపు:

ముగింపుగా, నిర్మాణాన్ని మెరుగుపరుచుకోకుండా కార్యక్రమాలు మనం అనుకున్న రీతిలో అమలు చేయలేమనేది ఎంత వాస్తవమో, కార్యక్రమాలు చొరవతో చేపట్టిన క్రమంలోనే నిర్మాణం మెరుగవుతుందనేది కూడా అంతే వాస్తవం. దీనిని దృష్టిలో వుంచుకుని అందరమూ మరింత చొరవతో, ఉత్సాహంతో మన అజెండాను అమలు చేయడానికి కృషి చేస్తూ కొత్త సభ్యులను ఉత్తేజపరుస్తూ నిర్మాణాన్ని మెరుగుపరుచుకుంటూ ముందుకు పోదామని ఆహ్వానిస్తున్నాను.

**27 మే 2007**
**శ్రీకాకుళం**

**ప్రధాన కార్యదర్శి**